www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO. APTEL/2010/33229



**విలేకరులు కావలెను**

17 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039




సంపుటి : 17 | సంచిక :51 | ఆదివారం 22.03.2026 | ఎడిటర్ :కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-


# బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించిన ఇరాన్..

## అమెరికా-బ్రిటన్ బేస్పై ఇరాన్ మిస్సైల్ దాడి

### 4 వేల కిలోమీటర్ల దూరంలోని యూఎస్ స్థావరంపైకి ఇరాన్ మిసైల్స్!



- హిందూ మహాసముద్రంలోకి విస్తరించిన యుద్ధం
- చాగోస్ దీవులలోని డియెగో గార్సియాలో సైనిక స్థావరం
- రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన ఇరాన్
- లక్ష్యాన్ని తాకలేకపోయిన రెండు క్షిపణులు
- 4 వేల కిలోమీటర్ల దూర దాడి సామర్థ్యంపై ఆందోళనలు
- తీవ్ర రూపం దాల్చుతున్న పశ్చిమాసియా యుద్ధం
- బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించిన ఇరాన్
- షాకైన అమెరికా, ప్రపంచ దేశాలు!

02

పశ్చిమాసియా యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చబోతోందా? మూడు వారాలుగా జరుగుతున్న యుద్ధం ముందు.. ముందు మరింత ఉద్రిక్తతలకు దారి తీయబోతుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇందుకు తాజాగా ఇరాన్ ప్రయోగించిన క్షిపణినే కారణంగా అంతర్జాతీయ మీడియా కోడైకూస్తోంది.ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ మొదట నుంచి అనేక అనుమానాలు వ్యక్తం చేస్తూ వస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్‌ను చేరుకునే క్షిపణులను ఇరాన్ తయారు చేస్తోందని ట్రంప్, నెతన్యాహు ఆరోపిస్తూ వచ్చారు. అన్నట్టుగానే తాజాగా ఆ అనుమానం నిజమైంది.హిందూ మహా సముద్రంలోని చాగోస్ దీవుల్లోని డియాగో గార్సియాలో ఉన్న అమెరికా-బ్రిటన్‌కు సంయుక్తంగా ఉన్న సైనిక స్థావరంపై ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే రెండింటిలో ఏ క్షిపణి కూడా లక్ష్యాన్ని ఛేదించలేదు. ఒకటి మార్గమధ్యలో విఫలం కాగా.. ఇంకొక క్షిపణిని అమెరికా యుద్ధ నౌక నుంచి ప్రయోగించిన ఇంటర్‌సెప్టర్ అడ్డుకుంది. అయితే బాలిస్టిక్ క్షిపణి ఏమైంది? అనేది స్పష్టత రాలేదు. అమెరికా అధికారులను ఉటంకిస్తూ ''వాల్ స్ట్రీట్ జర్నల్'' తన కథనంలో పేర్కొంది. ఈ ఘటనతో ప్రపంచ దేశాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి.


## హర్మూజ్ జలసంధిపై అమెరికా కీలక ప్రకటన..



యుద్ధాన్ని ముగిస్తాయి
ఆశించిన లక్ష్యాలకు చేరువయ్యాం
ఇరాన్ తో యుద్ధం కొనసాగించడం మా ఉద్దేశ్యం కాదు
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

02

## ఇరాన్‌కు విశ్వసనీయ మిత్రులం..



ఇరాన్‌కు విశ్వసనీయ మిత్రులం నమ్మకమైన భాగస్వామిగా ఉంటాం రష్యా అధ్యక్షుడు పుతిన్ సందేశం

## త్వరలో తెలంగాణకు ప్రధాని మోడీ..

### విభేదాలకు చెక్ పడేనా?



- రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలే ప్రధాన ఎజెండాగా భారీ బహిరంగ సభ
- పార్టీ నేతలతో సమావేశం ఉండేలా ప్లాన్
- మోడీ రాకతో తెలంగాణ బీజేపీలో కొత్త జోష్ పెరిగే అవకాశం
- రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల కోసం ఇప్పటికే పార్టీ నేతలు కసరత్తు
- అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటిన బీజేపీ

03

## కుల్సుంపురాలో ఫుడ్ స్కాం బట్టబయలు..




- హైదరాబాద్ కుల్సుంపురాలో భారీ ఫుడ్ స్కాం బట్టబయలు
- కుళ్లిన పదార్థాలతో సమోసాలు, పఫ్స్ తయారీ
- ప్రముఖ హోటళ్లకు సరఫరా చేస్తున్న నిందితుడు
- అబ్దుల్ రషీద్ (73) అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- H-FAST, టాస్క్‌ఫోర్స్, పోలీసులు సంయుక్త దాడులు
- రూ.5 లక్షల విలువైన నాసిరకం పదార్థాల స్వాధీనం..

06

## యుద్ధం ఎఫెక్ట్...!

### సింగరేణికి పేలుడు పదార్థాలు కొరత



- యుద్ధంతో పేలుడు పదార్థాల కొరత
- ప్రధానంగా బొగ్గు ఉత్పత్తిలో ఓపెన్ కాస్ట్ గనులు కీలకం
- ప్రతి ఏట 3 లక్షల టన్నుల పేలుడు పదార్థాలు అవసరం
- ఓపెన్ కాస్ట్ లో రోజుకు 800 టన్నుల సైట్ మిక్స్డ్ ఎమల్షన్ అవసరం
- మరోవైపున డీజిల్ కొరత కూడా తీవ్రంగానే ఉంది

02

### మానవ అక్రమ రవాణా

## బండారం బట్టబయలు..

"ఉద్యోగం, మంచి జీవితం, పెళ్లి" అంటూ...

అమాయక గిరిజన యువతులను లక్ష్యంగా చేసుకున్న అంతరాష్ట్ర ముఠా

ఒక్కో యువతిని రూ.2.50 లక్షలకు విక్రయించి...



- అమాయక గిరిజన యువతులను లక్ష్యంగా చేసుకున్న అంతరాష్ట్ర ముఠా
- పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పి ఇతర రాష్ట్రాలకు అమ్మేస్తున్న దారుణం
- ఒక్కో యువతిని రూ.2.50 లక్షలకు విక్రయించి...
- గతేడాది జూన్‌లో ఈ యువతులు ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం
- ఏజెన్సీ ప్రాంతాల్లో పోడు వ్యవసాయం తప్ప జీవనాధారం లేని పరిస్థితిని దుర్వినియోగం చేస్తూ..
- ముఠాలు మహిళలను మధ్యప్రదేశ్ కు తరలించి వ్యభిచారంలోకి నెట్టిన ఘటనలు

06



### మక్కా మసీదులో ఘనంగా

## రంజాన్ వేడుకలు..

ముస్లిం సోదరులకు సీఎం రేవంత్ రెడ్డి విషెస్


భక్తిశ్రద్ధలతో ముస్లింల సామూహిక ప్రార్థనలు

- ప్రభుత్వం తరపున పకడ్బందీ ఏర్పాట్లు..
- చార్మినార్, మక్కా మసీదు పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు
- సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం నిఘా
- ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ముందస్తుగా ఆంక్షలు
- లోక కల్యాణం కోసం, శాంతి సౌభాగ్యాల కోసం ప్రత్యేక దువా చేశారు
- మక్కా మసీదులో వేలాది మంది ముస్లిం సోదరులు సామూహిక నమాజ్

02

## దూసుకుపోతున్న భారత్..

### ప్రతీ 45 రోజులకు ఒక విమానాశ్రయం ప్రారంభం..



- తెలంగాణలో త్వరలో కొత్త ఎయిర్ పోర్టులు ప్రారంభం..
- ప్రతీ 45 రోజులకు అందుబాటులోకి కొత్త ఎయిర్ పోర్ట్..
- మంత్రి రామ్మోహన్ నాయుడు కీలక వ్యాఖ్యలు..
- దేశీయ విమానయాన రంగంలో జరుగుతున్న విప్లవాత్మక మార్పులు
- విమాన ప్రయాణం విలాసం కాదు, అది ఒక అవసరం
- మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకే ప్రయాణ సౌకర్యం

02

## మాది శ్రమ ఫలితం.. మీది శిలా ఫలకం!

### ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటకు వస్తున్నావ్ రేవంత్



- నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాల
- ఇప్పటికైనా కాళేశ్వరంపై చిల్లర మాటలు మానుకో 20 కోట్ల లీటర్ల నీటి నిలువ సామర్థ్యం కలిగిన పాండ్ నిర్మించాం
- కనపడిన ప్రతి దేవుడు మీద ఒట్టుపెట్టి రుణమాఫీ అన్నారు..
- మూడు పంటలకు రైతు బంధు ఎగ్గొట్టారు.... ఏ రైతు బంధు ఇస్తున్నారో రేవంత్ తెలపాలి.

03

# డ్రగ్స్ కేసులో ట్విస్ట్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మొయినాబాద్ డ్రగ్స్ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పటికే ఈ వ్యవహారాన్ని తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. కేసు మూలాలను, అంతర్జాతీయ సంబంధాలను ఛేదించేందుకు ఇటీవలే రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో సిట్ ను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి డ్రగ్స్ సరఫరా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్ ను ప్రత్యేక దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అభిషేక్ సింగ్, రోహిత్ రెడ్డి నిర్వహించే పార్టీలకు ప్రధానంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లుగా సిట్ గుర్తించింది. ఇక రోహిత్ రెడ్డి డ్రైవర్ శరత్, అభిషేక్ సింగ్ నుంచి నేరుగా డ్రగ్స్ కొనుగోలు చేసినట్లుగా ఆధారాలు కూడా లభించినట్లుగా సమాచారం. రోహిత్ రెడ్డి సూచనల మేరకే శరత్ ఈ డ్రగ్స్‌ను సేకరించినట్లుగా తెలుస్తోంది. గతంలో రోహిత్ రెడ్డికి సుమారు 24 సార్లు అభిషేక్ సింగ్ డ్రగ్స్ సరఫరా చేసినట్లుగా సమాచారం. అభిషేక్ సింగ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు, అందులోని కాల్ డేటా, మెసేజ్‌లను విశ్లేషిస్తున్నారు. అనంతరం ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరు ఉన్నారు..? ఎక్కడి నుండి డ్రగ్స్ వస్తున్నాయి..? అనే విషయాలను బయటకు తీసే పనిలో ఉన్నారు. మరోవైపు, రోహిత్ రెడ్డి కస్టడీ పిటిషన్‌పై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది.

# హుజూరాబాద్ బీఆర్ఎస్‌లో ముసలం

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీరుపై నేతల తిరుగుబాటు

**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** హుజూరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఒంటెద్దు పోకడలు, ఆయన వ్యవహారశైలిపై స్థానిక నాయకత్వం తిరుగుబావుటా ఎగురవేసింది. శుక్రవారం రాత్రి జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారంలోని ఓ వెంచర్‌లో నియోజకవర్గ స్థాయికి చెందిన సుమారు వందమంది ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు అత్యవసరంగా 'రహస్య సమావేశం' నిర్వహించడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది.

**సీనియర్ల విస్మరణ.. వ్యక్తిగత అజెండాపై ఆగ్రహం**

ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే తీరు వల్ల నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్ట దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న సీనియర్ నాయకులను ఎమ్మెల్యే కనీసం గౌరవించడం లేదని మండిపడ్డారు. వీణవంక జాతర వంటి తన వ్యక్తిగత వివాదాలను పార్టీపైకి రుద్దుతున్నారని, దీనివల్ల కార్యకర్తలు అనవసరంగా పోలీసు కేసుల పాలవుతున్నారని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో సొంత పార్టీ అభ్యర్థుల ఓటమికి ఎమ్మెల్యే పరోక్షంగా కారణమయ్యారని కొందరు కౌన్సిలర్లు నేరుగానే ఆరోపించారు. క్షేత్రస్థాయిలో పార్టీని నమ్ముకున్న వారిని గాలికి వదిలేసి, తన సొంత అజెండా కోసం అందరినీ వాడుకుంటున్నారని నేతలు వాపోయారు. సమావేశంలో పాల్గొని అసమ్మతి గళం వినిపించిన ప్రముఖులలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్లు తక్కల్లపల్లి రాజేశ్వరరావు, పోడేటి రామస్వామి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఎడవెల్లి కొండారెడ్డి, జమ్మికుంట మాజీ మార్కెట్ చైర్మన్, పింగిలి రమేష్, కన్నూరు సత్యనారాయణ రావు, చుక్క రంజిత్, విజయభాస్కర్ రెడ్డి, పింగళి ప్రదీప్ రెడ్డి, బాలసాని కుమారస్వామి, బచ్చు శివకుమార్, వెంకట్ రెడ్డి, తోట లక్ష్మణ్, కృష్ణారెడ్డి సహా పలువురు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ఉన్నారు.

**ఆయన వెంట ఉంటే కేసులే..**

కౌశిక్ రెడ్డి వెంట ఉంటే తమపై పోలీసు కేసులు తప్ప పార్టీకి గానీ, నియోజకవర్గానికి గానీ వచ్చే ప్రయోజనం ఏమీ లేదని ఒక సీనియర్ నేత వ్యాఖ్యానించారు. అందరం కలిసికట్టుగా ఉండి పార్టీని, తమ రాజకీయ భవిష్యత్తును కాపాడుకుంటామని నేతలు తీర్మానించారు. తమ తదుపరి ప్రణాళికను త్వరలోనే బహిరంగంగా ప్రకటిస్తామని స్పష్టం చేయడంతో హుజూరాబాద్ గులాబీ పార్టీలో ఏం జరగబోతుందనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

# మక్కా మసీదులో ఘనంగా రంజాన్ వేడుకలు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా జరుపుకునే ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పండుగ వేడుకలు భాగ్యనగరంలో అంబరాన్నంటాయి. చారిత్రాత్మక మక్కా మసీదు ముస్లిం సోదరుల సామూహిక ప్రార్థనలతో సందడిగా మారింది. నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు, నేడు పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మక్కా మసీదులో వేలాది మంది ముస్లిం సోదరులు సామూహిక నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా లోక కల్యాణం కోసం, శాంతి సౌభాగ్యాల కోసం ప్రత్యేక దువా చేశారు. నమాజ్ అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' అని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**ప్రభుత్వం తరపున పకడ్బందీ ఏర్పాట్లు..**

నమాజ్ కోసం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. చార్మినార్, మక్కా మసీదు పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు. పాతబస్తీ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ముందస్తుగా ఆంక్షలు విధించారు.

**ముస్లిం సోదరులకు సీఎం రేవంత్ రెడ్డి విషెస్**

పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా ముస్లిం సోదర సోదరీమణులకు ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. 'క్రమశిక్షణ, దైవచింతన, దానగుణానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు నింపాలి. ఈ పవిత్ర దినాన అందరూ ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను' అని సీఎం తన సందేశంలో పేర్కొన్నారు. నగరంలోని పలు మసీదులు, ఈద్గాల వద్ద కూడా వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.

# యుద్ధం ఎఫెక్ట్..!

## సింగరేణికి పేలుడు పదార్థాలు కొరత



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** యుద్ధ ప్రభావం సింగరేణి మీద పడింది. ఉత్పత్తిలో టార్గెట్ ను రీచ్ కాలేకపోతుంది. అసలు ఈ పరిస్థితికి కారణం ఏంటి దానికి యుద్ధానికి లింక్ ఏంటి యాజమాన్యం ఏమంటుంది? ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు ఉమ్మడి జిల్లాలో విస్తరించి ఉన్న సింగరేణి సంస్థ దేశానికే తలమాణికం. ఇది పారిశ్రామికీకరణతో పాటు అనేక ధర్మల విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ఉన్న 12 ఏరియాల్లో 18 ఓపెన్ కాస్ట్ గనులు 19 భూగర్భ గనులు ఉన్నాయి. ఇందులో ఓపెన్ కాస్ట్ గనుల్లోనే 80% నికి పైగా బొగ్గు ఉత్పత్తి సాగుతుంది. అనుకున్న టార్గెట్ ను ఓపెన్ కాస్ట్ గనులే తీర్చుతూ ఉంటాయి. అయితే ఇప్పుడు సింగరేణికి ఇప్పుడు యుద్ధం సమస్య వచ్చిపడింది. యుద్ధంతో పేలుడు పదార్థాల కొరత ఏర్పడింది. ఇప్పటికైతే అధికారికంగా స్పష్టం చేయడం లేదు. కానీ.. పేలుడు పదార్థాల కొరత ఉంది. ప్రధానంగా బొగ్గు ఉత్పత్తిలో ఓపెన్ కాస్ట్ గనులు కీలకంగా ఉంటున్నాయి. అయితే ఇందులో బొగ్గు ఉత్పత్తి చేయడానికి ముందుగా మట్టిని తొలగించాల్సి ఉంటుంది. ఆ తర్వాత బొగ్గు వెలికి తీస్తారు. మట్టి బొగ్గు వెలికి తీయడానికి పేలుడు పదార్థాలు అవసరం ఉంటాయి. అవి ఎక్కువ శాతం ఓడల ద్వారానే వస్తాయి. సింగరేణి వ్యాప్తంగా ప్రతి ఏట 3 లక్షల టన్నుల పేలుడు పదార్థాలు అవసరమవుతాయని అంచన. ఓపెన్ కాస్ట్ లో రోజుకు 800 టన్నుల సైట్ మిక్స్ ఎమల్షన్ అవసరం ఉంటుంది. అయితే ఈ పేలుడు పదార్థాల ఉత్పత్తికి అమ్మోనియం నైట్రేట్ అవసరం అవుతుంది. అది విదేశాల నుంచి దిగుమతి కావలసి ఉంటుంది. ఈ దిగుమతిని యుద్ధం ప్రారంభమైన తర్వాత సగానికి సగం వరకు తగ్గించారు. దీనితో తెలంగాణలో అతి పెద్ద పరిశ్రమైన సింగరేణిలో కూడా దాని ప్రభావం పడనుంది. డీజిల్, పెట్రోల్ కొరత వచ్చే విధంగా సింగరేణి రాబోయే కాలంలో ఎదుర్కొనే సమస్యల్లో మొట్టమొదటిది. ఒకవైపు పేలుడు పదార్థాల కొరత ఉంటే.. మరోవైపున డీజిల్ కొరత కూడా తీవ్రంగానే ఉంది. సింగరేణి సంస్థకు పెద్ద ఎత్తున ఇది అవసరం అవుతుంది. ఓపీలో షావల్, డంపర్లు, డోజర్లు, భారీ వాహనాలు, పలు రకాల యంత్రాలు వాడకానికి డీజిల్ అవసరం ఉంది. దీనికోసం ప్రతిరోజు 10 లక్షల లీటర్ల వరకు డీజిల్ ని ఉపయోగిస్తూ ఉంటారు. అయితే అంత పెద్ద మొత్తంలో డీజిల్ సరఫరా చేయలేమని చమురు సంస్థలు చెప్పాయి. దీనితో ఆ యుద్ధం ప్రభావం సింగరేణి మీద పడుతుందది ప్రత్యక్షంగా. దీనికి కారణం సింగరేణికి అవసరమైనటువంటి ఇంధనం అలాగే సింగరేణిలో వాడేటువంటి బ్లాస్టింగ్ కు వాడేటువంటి సరకులు ఏవైతే ఉన్నాయో అవి కూడా దొరకడం చాలా కష్ట సాధ్యం అవుతున్నటువంటి పరిస్థితి ఉంది. దాని కారణంగా సింగరేణి ఉత్పత్తి మీద ప్రభావం చూపెడుతుంది. యుద్ధంతో పెద్ద సమస్య సింగరేణికి ఎదురవుతుందని సింగరేణి కార్మికులు కార్మిక సంఘాల నేతలు అంటున్నారు. ఈ సమస్య నుంచి బయట పడడానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. పశ్చిమ ఆసియా దేశాలలో జరుగుతున్న యుద్ధాల వల్ల సింగరేణనికి కొంత ప్రభావం ఎఫెక్ట్ పెరుగుతూ ఉంది. అంతే కాదు భారీగా నష్టం జరిగే ప్రమాదం ఉంది.




# ఇరాన్‌కు విశ్వసనీయ మిత్రులం..

**రష్యా :** ఇరాన్‌కు రష్యా విశ్వసనీయ మిత్రుడు అని అధ్యక్షుడు పుతిన్ సందేశం ఇచ్చారు. నౌరుజ్ పెర్షియన్ నూతన సంవత్సరం పండుగ సందర్భంగా ఇరాన్ నాయకులకు రష్యా అధ్యక్షుడు పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. మాస్కో-టెహ్రాన్ మంచి మిత్రులు అని..నమ్మకమైన భాగస్వామిగా ఉంటుందని శనివారం పుతిన్ కీలక సందేశం పంపించారు. దేశ సర్వోన్నత నాయకుడు అయతుల్లా మోజ్తాబా ఖమేనీకి, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌కు పుతిన్ శుభాకాంక్షలు పంపారని క్రెమ్లిన్ తెలిపింది. "ఇరాన్ ప్రజలు కఠినమైన పరీక్షలను గౌరవప్రదంగా అధిగమించాలని పుతిన్ ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో మాస్కో టెహ్రాన్‌కు నమ్మకమైన మిత్రుడుగా, విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తుంది." అని క్రెమ్లిన్ తెలిపింది. ఇక రష్యాకు సంబంధించిన నిఘా సమాచారాన్ని వాషింగ్టన్ ఉక్రెయిన్‌కు అందించడం మానేస్తే.. ఇరాన్‌తో నిఘా సమాచారాన్ని పంచుకోవడం క్రెమ్లిన్ ఆపేస్తుందని మాస్కో వాషింగ్టన్‌కు ఒక ప్రతిపాదన చేసిందని.. అయితే అమెరికా ఆ ఆలోచనను తిరస్కరించిందని పొలిటికో నివేదించింది. క్రెమ్లిన్ మాత్రంఈ నివేదికను నకిలీదిగా కొట్టిపారేసింది. వెనిజులా నాయకుడు నికోలస్ మదురోను అమెరికా కూలదోయడంతో రష్యా ఒక మిత్రదేశాన్ని కోల్పోయింది. ఇప్పుడు వ్యూహాత్మక భాగస్వామి అయిన ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల వల్ల పెరిగిన చమురు ధరల నుంచి మాస్కో మాత్రం ప్రయోజనం పొందింది. అయితే ఇరాన్ అణు బాంబును అభివృద్ధి చేయడాన్ని తాము కోరుకోవడం లేదని రష్యా పదేపదే చెబుతోంది. అయితే ఈ చర్య మధ్యప్రాచ్యం అంతటా అణ్వాయుధ పోటీకి దారితీస్తుందని మాస్కో భయపడుతోంది. గత నెల 28న ఇరాన్ అధ్యక్ష భవనంపై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమయ్యారు. దీంతో ప్రతీకారంగా ఇరాన్.. గల్ఫ్ దేశాలపై దాడి చేసింది. అంతేకాకుండా హార్ముజ్ జలసంధిని మూసేసింది. దీంతో ప్రపంచ దేశాల్లో గ్యాస్, చమురు సంక్షోభం తలెత్తింది.

# బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించిన ఇరాన్..

**ఢిల్లీ :** పశ్చిమాసియా యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చబోతోందా? మూడు వారాలుగా జరుగుతున్న యుద్ధం ముందు.. ముందు మరింత ఉద్రిక్తతలకు దారి తీయబోతుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇందుకు తాజాగా ఇరాన్ ప్రయోగించిన క్షిపణినే కారణంగా అంతర్జాతీయ మీడియా కోడైకూస్తోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ మొదట నుంచి అనేక అనుమానాలు వ్యక్తం చేస్తూ వస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్‌ను చేరుకునే క్షిపణులను ఇరాన్ తయారు చేస్తోందని ట్రంప్, నెతన్యాహు ఆరోపిస్తూ వచ్చారు. అన్నట్టుగానే తాజాగా ఆ అనుమానం నిజమైంది. హిందూ మహా సముద్రంలోని చాగోస్ దీవుల్లోని డియాగో గార్సియాలో ఉన్న అమెరికా-బ్రిటన్‌కు సంయుక్తంగా ఉన్న సైనిక స్థావరంపై ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే రెండింటిలో ఏ క్షిపణి కూడా లక్ష్యాన్ని ఛేదించలేదు. ఒకటి మార్గమధ్యలో విఫలం కాగా.. ఇంకొక క్షిపణిని అమెరికా యుద్ధ నౌక నుంచి ప్రయోగించిన ఇంటర్‌సెప్టర్ అడ్డుకుంది. అయితే బాలిస్టిక్ క్షిపణి ఏమైంది? అనేది స్పష్టత రాలేదు. అమెరికా అధికారులను ఉటంకిస్తూ "వాల్ స్ట్రీట్ జర్నల్" తన కథనంలో పేర్కొంది. ఈ ఘటనతో ప్రపంచ దేశాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ఇరాన్ భూభాగం నుంచి డియాగో గార్సియా సైనిక స్థావరానికి దాదాపు 4,000 కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే ఇప్పటి వరకు ఇరాన్ దగ్గర 2,000-3,000 కిలోమీటర్ల దూరాన్ని ఛేదించగల క్షిపణులు మాత్రమే ఉన్నాయని ప్రపంచం భావించింది. కానీ తాజా ఘటనతో టెహ్రాన్ దగ్గర 4,000 కిలోమీటర్ల లక్ష్యాన్ని ఛేదింగల బాలిస్టిక్ క్షిపణులు ఉన్నాయని తేలిపోయింది. ఈ పరిణామం పశ్చిమ దేశాలను మరింత ఆందోళనలకు గురి చేస్తున్నాయి. అయితే ఈ ఘటనపై ఇప్పటి వరకు అధికారికంగా పెంటగాన్ స్పందించలేదు. ఏ అధికారి కూడా అధికారికంగా ధృవీకరించలేదు. ఒకవేళ ఈ వార్త నిజమైతే మాత్రం.. ఇరాన్ దక్షిణాసియాను కూడా ఛేదించగలదని అర్థమవుతోంది. ప్రస్తుత యుద్ధాన్ని ఇరాన్ మరింత తీవ్రతరం చేసి పశ్చిమ దేశాలకు స్ట్రాంగ్ సందేశం పంపే అవకాశం ఉందని మాజీ కేంద్ర మంత్రి మనీష్ తివారీ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.



# దూసుకుపోతున్న భారత్..

**ఢిల్లీ :** దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోంది. అన్ని రాష్ట్రాల్లో పాత ఎయిర్ పోర్టులకు మరమ్మతులతో పాటు కొత్త విమానశ్రయాన్ని ఏర్పాటు చేస్తోంది. ప్రతి 45 రోజులకు ఓ ఎయిర్ పోర్టును ప్రారంభిస్తోంది. ఎయిర్‌పోర్టుల ప్రారంభంతో దేశాలు, రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని పెంచుతోంది. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో ఎక్కడెక్కడ ఎయిర్ పోర్టుల అవసరం ఉందో అక్కడ నిర్మాణాలకు శ్రీకారుం చుడుతోంది. ఇందులో భాగంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తాజాగా మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన దేశంగా భారత్ అవతరించిందని తెలిపారు. సుస్థిరమైన వృద్ధిని కూడా సాధిస్తోందని, దీంతో ప్రపంచ దేశాలు చాలా ఆసక్తిగా ఇండియా వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతీ 45 రోజులకు ఓ విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఉడాన్ స్కీమ్ ద్వారా సామాన్యులకు విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురాబోతున్నామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

# హార్మూజ్ జలసంధిపై అమెరికా కీలక ప్రకటన..

**అమెరికా :** ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ సమయంలో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు హార్మూజ్ జలసంధి.. ప్రపంచ ఇంధన మార్కెట్లను ప్రభావితం చేసే హార్మూజ్ జలసంధి.. చాలా దేశాలు ఇంధన, గ్యాస్ కొరతకు కారణం అవుతుంది.. అయితే, హార్మూజ్ జలసంధిపై అమెరికా కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాంతంలో సరఫరాలకు అంతరాయం కలగడంతో చమురు, గ్యాస్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో, అమెరికా ఇరాన్‌పై ఆంక్షలను సడలించే అంశాన్ని పరిశీలిస్తోంది. ఇరాన్‌కు సంబంధించిన చమురు సరఫరాలు సముద్రంలో నిలిచిపోవడంతో, వాటిని విడుదల చేస్తే 3 నుంచి 4 రోజుల్లో ఆసియా దేశాల ఓడరేవులకు చేరవచ్చని అమెరికా ఇంధన శాఖ కార్యదర్శి క్రిస్ రైట్ తెలిపారు. అమెరికా ప్రభుత్వం తాత్కాలికంగా 30 రోజుల పాటు ఇరాన్ చమురుపై ఉన్న ఆంక్షలను సడలించింది. దీని వల్ల సముద్రంలో నిలిచిపోయిన ట్యాంకర్లు తిరిగి ప్రయాణం ప్రారంభించి, సరఫరాలను వేగవంతం చేసే అవకాశం ఉంది. అంతకుముందు, స్కాట్ బెస్సెంట్ కూడా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ, సరఫరా అంతరాయాలను తగ్గించేందుకు ఈ చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రపంచ చమురు వాణిజ్యంలో కీలక మార్గమైన హార్మూజ్ జలసంధి చుట్టూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ధరలు పెరిగాయి. ఈ పరిస్థితిని నియంత్రించడానికి సరఫరాలను పునరుద్ధరించడం అత్యవసంమని నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ అధిపతి ఫాతిహ్ బిరోల్ ప్రపంచం తీవ్రమైన ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశముందని హెచ్చరించారు. గల్ఫ్ దేశాల నుంచి సరఫరాలు పూర్తిగా సాధారణ స్థితికి రావడానికి ఆరు నెలల వరకు పట్టవచ్చని తెలిపారు. అంతేకాకుండా, సరఫరా సమస్యలు కొనసాగితే చమురు ధరలు బ్యారెల్‌కు 180 డాలర్లకు పైగా పెరిగే అవకాశముందని గల్ఫ్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. అలాంటి పరిస్థితిలో ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉంది. మొత్తానికి, హార్మూజ్ జలసంధి పరిస్థితులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపేలా మారుతున్నాయి. అమెరికా తీసుకునే నిర్ణయాలు రాబోయే రోజుల్లో చమురు ధరలను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించనున్నాయి.



# ఈద్గా వద్ద మత ప్రార్థనలో మంత్రి వివేక్ వెంకటస్వామి..

**మందమర్రి,ఫ్లాష్ ఇండియా :** పవిత్ర రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసం మానవాళికి ఉన్నతమైన విలువలను నేర్పించే పవిత్ర కాలమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని శనివారం నాడు మందమర్రిలోని విద్యానగర్, సీఈఆర్ క్లబ్ సమీపంలోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులతో కలసి ప్రార్థనల్లో పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ.. గంగా జమునా తేహజీబ్ లాగా చెన్నూరు నియోజక వర్గంలోని ప్రజలు హిందూ, ముస్లిం సఖ్యతకు ప్రతీక అన్నారు. ప్రేమ, అనురాగాలు, మానవత్వంతో ప్రజలందరూ ఉన్నప్పుడే సమాజం సుభిక్షంగా ఉంటుంది. మందమర్రిలో రూ. 50 లక్షలతో షాదిఖానా, ఈద్గా వద్ద కాంపౌండ్ వాల్, ఇతర అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. త్వరలోనే సింగరేణి సంస్థతో మాట్లాడి, ఈద్గా వద్ద కమాన్ కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి వివేక్ పేర్కొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# అజారుద్దీన్ మంత్రి పదవికి దగ్గర పడుతున్న గడవు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో మంత్రి అజారుద్దీన్ అంశం ఉత్కంఠ రేపుతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అనూహ్యంగా మంత్రివర్గంలో బెర్త్ కొట్టేసిన ఈ టీమిండియా మాజీ కెప్టెన్‌కు ఇప్పుడు మంత్రిగా తన ఫ్యూచర్ ఏంటో అనే టెన్షన్ పట్టుకుందట. అసెంబ్లీలో సభ్యత్వం లేని అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసిన ఆరు నెలల్లోపు ఏదో ఒక సభకు ప్రాతినిథ్యం వహించాల్సి ఉండగా ఆ గడువు ఏప్రిల్ ఆఖరంతో ముగియబోతోంది. దీంతో అజారుద్దీన్ ఫ్యూచర్ ఏంటి? ఇంతకు ఆయన మంత్రి పదవి ఉంటుందా? ఊడుతుందా? మైనార్టీ కోటాలో ఉన్న ఏకైక మంత్రి కావడంతో అజారుద్దీన్ ను కంటిన్యూ చేసేందుకు ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లతో ఉందనేది ఆసక్తిగా మారింది.

**ఆశలన్నీ గవర్నర్ పైనే?:**

సాంకేతికంగా అజారుద్దీన్ కేబినెట్ లో కొనసాగాలంటే మరో నెలలోపు ఏదైనా చట్టసభకు ఎన్నిక కావాల్సి ఉంది. అయితే అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోకమందే ప్రొ.కోదండరామ్, అమీర్ అలీఖాన్ పేర్లను ప్రభుత్వం ఎమ్మెల్సీగా నామినేట్ చేసింది. వారు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేసినా కోర్టు కేసుల నేపథ్యంలో సుప్రీంకోర్టు వారిని పదవీచ్యుతులను చేసింది. తిరిగి నామినేట్ చేసుకునే అవకాశం ప్రభుత్వానికి కోర్టు కల్పించింది. దాంతో ప్రొ.కోదండరామ్, అజారుద్దీన్ పేర్లను ప్రభుత్వం నామినేట్ చేసినా గవర్నర్ మాత్రం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఎమ్మెల్సీగా అజారుద్దీన్ పేరును ప్రభుత్వం సిఫార్సు చేసినా ఇంకా గవర్నర్ ఆమోదించలేదు. కానీ ఏప్రిల్ ఆఖరుతో అజారుద్దీన్‌కు ఉన్న గడవు ముగియడంతో అధికార పార్టీ ఆశలన్నీ గవర్నర్ నిర్ణయంపైనే ఉన్నట్లు తెలుస్తోంది. కవిత రాజీనామాతో ఓ ఎమ్మెల్సీ స్థానం ఖాళీగా ఉన్నప్పటికీ అది స్థానిక సంస్థల ఎన్నికల కోటా కావడంతో పరిషత్ ఎన్నికల తర్వాతే అక్కడ ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉంది. దాంతో గడువులోపు కవిత స్థానంలో తాను పదవి ఎక్కేందుకు అజారుద్దీన్‌కు దాదాపు అసాధ్యమనే చర్చ జరుగుతోంది.

**ఇద్దరిలో మిగిలింది ఒక్కరేనా?:**

అజారుద్దీన్ ను చట్టసభలకు పంపించే విషయంలో మరో ఆప్షన్ కూడా రాష్ట్ర రాజకీయాల్లో తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా ఉన్న బల్మూరి వెంకట్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఈ ఇద్దరిలో ఎవరో ఒకరి చేత రాజీనామా చేయించి ఆ స్థానానికి అజారుద్దీన్‌ను పంపించే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతూ వస్తోంది. అయితే తాజాగా బల్మూరి వెంకట్‌కు, ప్రభుత్వం మండలిలో విప్ గా అవకాశం కల్పించింది. దీంతో బల్మూరి రాజీనామా అంశాన్ని అధికార పార్టీ పక్కన పెట్టిందనే చర్చ జరుగుతోంది. ఇక మహేశ్ కుమార్ గౌడ్ పేరు వినిపిస్తున్నా పీసీసీ చీఫ్‌గా ఉన్నందునా అతడి చేత రాజీనామా చేయిస్తారా అనేది అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అజారుద్దీన్ మంత్రి పదవి మూన్నాళ్ల ముచ్చటగానే మిగులుతుందా లేక సీఎం రేవంత్ రెడ్డి ఏదైనా వ్యూహంతో ఉన్నారా అనేది ఇటు కాంగ్రెస్ అటు ప్రతిపక్షాల్లో చర్చ జరుగుతోంది.



# మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

**కొల్లాపూర్,ఫ్లాష్ ఇండియా :** మైనార్టీల సంక్షేమానికి ప్రజాపాలన ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ లో రంజాన్ పండుగను ముస్లింలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఖాదర్ భాషా దర్గా వద్ద ఈద్గా ప్రాంగణంలో మైనార్టీ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియా తో మాట్లాడారు. మైనార్టీల సంక్షేమం కొరకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోనీ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మైనార్టీల అభివృద్ధి కొరకు కొల్లాపూర్ పట్టణంలో ఖాదర భాష దర్గా అభివృద్ధి కొరకు రూ.4.70 కోట్ల రూపాయలు కేటాయించినట్టు మంత్రి జూపల్లి తెలిపారు.కొల్లాపూర్ నియోజకవర్గంలో అన్నీ వర్గాలతో పాటు ముస్లింలకు సైతం అభివృద్ధి సంక్షేమం కోసం పాటు పడుతూ రంగాల్లోముస్లింలు కుటుంబాల్లోని పిల్లలు విద్యా పరంగా ఉన్నత శిఖరాలకు రాణించాలని, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మీరంతా మా వెంట ఉండి గెలిపించినందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులను ఆలింగం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రహీం బాషా మంత్రి జూపల్లికి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి సత్యనారాయణ, ముస్లిం మత పెద్ద, డీసీసీ ఉపాధ్యక్షులు రంగినేని జశ్వరుడు, రాంయాదవ్, పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

# త్వరలో తెలంగాణకు ప్రధాని మోడీ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రధాని నరేంద్ర మోడీ త్వరలో తెలంగాణలో పర్యటించనున్నారనే వార్త రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఏప్రిల్ రెండో వారంలో పీఎం టూర్ షెడ్యూల్ కాబోతున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పీఎం అక్కడ ఎన్నికల ప్రచారంలో పాల్గొనబోతున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణలో కూడా పర్యటించేలా తెలంగాణ బీజేపీ నేతలు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటనలో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్ ప్రారంభోత్సవం సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. అలాగే రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలే ప్రధాన ఎజెండాగా భారీ బహిరంగ సభ లేదా పార్టీ నేతలతో సమావేశం ఉండేలా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

**బీజేపీ శ్రేణులకు జోష్:**

మోడీ టూర్ విషయంలో ఇప్పటికే రాష్ట్ర నేతలకు సంకేతాలు అందాయని ఇందులో భాగంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇవాళ లేదా అతి త్వరలో పార్టీ నేతలతో అంతర్గత సమావేశం ఏర్పాటు చేయబోతున్నట్లు తెలుస్తోంది. మోడీ టూర్ ఎజెండాపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో బలపడాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీకి ఈ పర్యటన ఒక బూస్ట్ ఇవ్వబోతోందనే చర్చ జరుగుతోంది. మోడీ రాకతో తెలంగాణ బీజేపీలో కొత్త జోష్ పెరిగే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గతంతో పోలిస్తే మెరుగుపడింది. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల కోసం ఇప్పటికే పార్టీ నేతలు కసరత్తు మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో మోడీ టూర్ తెలంగాణ కమలం పార్టీలో కొత్త ఉత్సాహం నింపనుంది.

**విభేదాలకు చెక్ పడేనా?:**

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటిన బీజేపీ ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మెజార్టీ స్థానాలు గెలుచుకునే అవకాశం ఉన్నా నేతల మధ్య అంతర్గత విభేదాల కారణంగా ఆశించిన ఫలితాలు దక్కలేదనే టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా కీలక నేతల మధ్య ఆధిపత్య పోరు పార్టీని భారీగా డ్యామేజ్ చేస్తోందనే విమర్శలు ఉన్నాయి. వీటిని చెక్ పెట్టడంలో రాష్ట్ర నాయకత్వం విఫలమవుతోందనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో గతంలో జరిగిన సమావేశంలో తీరు మార్చుకోవాలని రాష్ట్ర నేతలను మోడీ హెచ్చరించారనే వార్తలు వచ్చాయి. అయినా అదే తంతు కొనసాగుతోందని ఇదే జరిగితే రాష్ట్రంలో బీజేపీకి ఉన్న అవకాశాలు దూరమవడం ఖాయం అనే అభిప్రాయాలు చేజేతులా దూరం చేసుకోవడమే తప్ప మరేమి కాదనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి రాబోతున్న మోడీ నేతల మధ్య విభేదాలకు చెక్ పెట్టి టీ బీజేపీని తిరిగి ట్రాక్ లోకి తీసుకురాబోతున్నారా? ఈ క్రమంలో మోడీ ఎలాంటి స్ట్రాటజీని ఉపయోగించబోతున్నారు అనేది ఉత్కంఠగా మారింది.

# మాది శ్రమ ఫలితం.. మీది శిలా ఫలకం!

## ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటకు వస్తున్నావ్ రేవంత్

**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. సీఎం రేవంత్ రేపు(ఆదివారం) సిద్దిపేట పర్యటన నేపథ్యంలో పలు ప్రశ్నలు సంధిస్తూ లేఖ విడుదల చేశారు. రేపు సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు హరీశ్ రావు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని.. అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా, రేపు సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 365 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ..'సీఎం రేవంత్ రెడ్డి రేపు ప్రారంభించే ఆయిల్ ఫ్యాక్టరీ 2021లోనే ప్రారంభించాం. ఈ ఆయిల్ ఫామ్‌కి ప్రాణాధారం కాళేశ్వరం ప్రాజెక్టు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం అన్న రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలి. కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. మొక్కవోని దీక్షతో పూర్తి చేసింది మేము. ఇప్పటికైనా కాళేశ్వరంపై చిల్లర మాటలు మానుకో. ఆ ప్రాజెక్టు పూర్తి చేయడంలో అనేక విధాలుగా శ్రమ పడ్డాం. 20 కోట్ల లీటర్ల నీటి నిలువ సామర్థ్యం కలిగిన పాండ్ నిర్మించాం. మలేషియా టెక్నాలజీతో ఇండియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాం.బీఆర్ఎస్ కృషి ఫలితమే ఆయిల్ ఫ్యాక్టరీ. దాన్ని ఈరోజు రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి, రెండు పీహెచ్సీలు నేను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండగా మంజూరు చేసి పూర్తి చేసినవి. వీటికి మీరు శిలాఫలకం వేసుకుని ప్రారంభిస్తున్నారు. ఇందులో మీరు చేసిందేమీ లేదు. మేము ఆలయాలు, విద్యాలయాలు, రిజర్వాయర్లు, జైళ్లు నిర్మించాం. రూ.78కోట్లతో 30 ఎకరాల్లో జిల్లా జైలు నిర్మించాం. కట్టించింది మేము, శిలాఫలకం మీరు వేసుకున్నారు. చేసుకో నాకేమీ ఈర్ష్య లేదు. కానీ శ్రమ ఎవరిది, శిలాఫలకం ఎవరిది?. కనపడిన ప్రతి దేవుడు మీద ఒట్టుపెట్టి రుణమాఫీ అన్నారు.. అది ఇప్పటికీ కాలేదు. సిద్దిపేట జిల్లాలో 22వేల మంది రైతులకు రూ.300కోట్ల రుణమాఫీ పెండింగ్‌లో ఉంది. ఒక నర్మేట్టలోనే 350మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మా నియోజకవర్గంలో రుణమాఫీ అయ్యింది 48 శాతం, కానిది 52 శాతం. మూడు పంటలకు రైతు బంధు ఎగ్గొట్టారు. రేపు ఏ రైతు బంధు ఇస్తున్నారో రేవంత్ తెలపాలి.పంటల బీమా రెండున్నర ఏళ్లుగా చేయలేదు. నష్టపోయిన రైతులకి ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదు. వడగళ్ల బాధిత రైతులకు నిధులు విడుదల చేయాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క పనీ సిద్దిపేటకు ఇవ్వలేదు. సిద్దిపేటలో జరుగుతున్న రూ.1071 కోట్ల పనులనూ అర్థాంతరంగా రద్దు చేశారు. ఆ నిధులు వెంటనే పునరుద్ధరించాలి. ప్రభుత్వ వెటర్నరీ కాలేజీ, రంగనాయకసాగర్ టూరిజం, శిల్పారామం, స్పోర్ట్స్ స్టేడియం ఇలా అనేక పనులు రద్దు చేశారు. వీటిలో కొన్నిటిని కొడంగల్‌కు రేవంత్ ఎత్తుకుపోయారు. ఇది ఒక ముఖ్యమంత్రి చేయాల్సిన పనేనా?. ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటకు వస్తున్నారు. మీరు రద్దు చేసిన గొప్పలు చెప్పుకోవడానికి వస్తున్నావా?' అంటూ ప్రశ్నించారు.

**బీఆర్ఎస్ పోరాటం ఫలితంగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని అసెంబ్లీలో బీఆర్ఎస్ పోరాటం ఫలితంగానే రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారన్నారు. క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర ఉంటే.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో దళారులకు రూ. 1600- 1700 లకే అమ్ముకుని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ముందే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఉంటే రైతులందరికీ మేలు జరిగేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే 20 నుంచి 25 శాతం మొక్కజొన్న దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందన్నారు. సన్‌ఫ్లవర్‌కు క్వింటాల్‌కు రూ. 7721 మద్దతు ధర ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తో జిల్లాలో యాసంగిలో సైతం రైతులు అధిక మొత్తంలో దిగుబడి సాధించారన్నారు. ఒకప్పుడు కరువుతో అల్లాడిన ప్రాంతానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక వరంలా మారిందన్నారు. ఈ ప్రాజెక్టు మన ప్రాంత రూపురేఖలను మార్చేసి, వ్యవసాయానికి కొత్త దిశానిర్దేశం చేసిందన్నారు. రైతులు ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దు, కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ పంటను అమ్ముకుని ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని హరీష్ రావు సూచించారు.



# సమైక్యతా సౌరభం.. రంజాన్ సంబరం!

**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** భారతీయ జీవన స్రవంతిలో అంతర్భాగమైన గంగా-జమునా తెహజీబ్‌కు నిలువుటద్దంగా, మత సామరస్యానికి మకుటాయమానంగా రంజాన్ పర్వదిన వేడుకలు శనివారం జిల్లా కేంద్రంతో పాటు ఏదులాపురం ప్రాంతంలో మిన్నంటాయి. ఈ సందర్భంగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

**సంక్షేమ పథకాలపై భరోసా..**

ఏదులాపురం మున్సిపాలిటీ మద్దులపల్లిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ఇందిరమ్మ ప్రభుత్వం మైనారిటీల పక్షపాతి. విద్యా, ఉపాధి రంగాల్లో ముస్లిం సోదరులకు అండగా ఉంటూ, పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే మంత్రి పొంగులేటి లక్ష్యం" అని భరోసా ఇచ్చారు.

**ఆత్మీయ ఆతిథ్యం..**

పండుగ వేళ ఆత్మీయతను చాటుతూ మద్దులపల్లిలోని ఎస్.కె. జానీ నివాసానికి, ఖమ్మం నగరంలోని సీనియర్ నాయకులు ఎస్.కె. ఇమామ్ భాయ్ గృహానికి వెళ్లిన దయాకర్ రెడ్డి, వారి ఆతిథ్యాన్ని స్వీకరించి ఈద్ ముబారక్ తెలియజేశారు. ఈ వేడుకల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్ గొడ్డుగొర్ల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# చంచల్‌గూడ 'అండా' సెల్‌లో వేయాలి





**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రముఖ ప్రవచనకర్త, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు 'మధ్యాహ్న భోజన పథకం'పై చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదస్పదానికి దారితీశాయి. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పై గరికపాటి చెప్పిన మాటలు ఓ వీడియో చక్కర్లు కొడుతోంది. ఈ వీడియోపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. నెటిజన్‌లు గరికపాటిపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ నేత, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ శనివారం ఎక్స్ వేదికగా స్పందించారు. గరికపాటి తన మనసులో మాటను చెప్పాడని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. నిజానికి ఈ సమాజంలో చాలామంది ఆధిపత్య వర్గాల పెద్దలకు-మేధావులకు తరతరాలుగా పేద వారి చదువులు, తినే తిండి మీద గరికపాటి లాంటి చులకన భావమే ఉంటుందని, దీనికి నా వద్ద వందల ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు.

**వాళ్లు నటిస్తారు, ఈయన నటించలేదు..**


అయితే, వాళ్లు నటిస్తారు, ఈయన నటించలేదని అన్నారు. అందుకే పేదరికం వివక్ష అనేవి ఈ దేశంలో నేటికీ పోవడం లేదని, రోహిత్ వేముల లాంటి వారు బలవుతూనే ఉన్నారని ఆవేదన చెందారు. గరికపాటి గడ్డి మాటలే కాదు, ఆయన అట్లా కడుపు నిండిన ప్రవచనాలు చేస్తుంటే చప్పట్లు కొడుతున్న మూర్ఖులను చూసి జాలి వేస్తున్నదని సంచలన వ్యాఖ్యలు చేశారు. మొన్న దళిత ఎమ్మెల్యే మందుల సామేలు ఇంటి మీద కోడి గుడ్ల దాడి చేసిన బండి సంజయ్ - బీజేపీ గ్యాంగ్ ఇప్పుడు బ్రాహ్మణ వర్గానికి చెందిన గరికపాటి ఇంటికి పోతరా? ముమ్మాటికీ పోరు.. అని ఆర్ఎస్పీ విమర్శించారు. 'మీరు చూస్తూ ఉండండి.. పోలీసులు కూడా కేసులు పెట్టరు.. జాతీయ బాలుర సంఘం, మానవ హక్కుల సంఘం ఇతనిని పిలవను కూడా పిలవదు' అని అభిప్రాయం తెలిపారు. 'పేద పిల్లలు పోషకాహారం తినకుండా అస్థిపంజరాలుగా మారి, వీళ్ల జెండాలు మోసే రోబోలుగా మారి గరికపాటి లాంటి వారి ప్రసంగాలకు చప్పట్లు కొడుతూ, ఓట్లేస్తూ ఉంటే చాలు.. గరికపాటి, అతని లాంటి వారిని కేసు పెట్టి చంచల్ గూడ 'అండా' సెల్ లో వేయాలి.. అప్పుడే తెలుగు రాష్ట్రాల్లో విజ్ఞానం వికసిస్తుంది' అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

**సోషల్ మీడియాలో వీడియో చక్కర్లు**

కాగా, సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియో ప్రకారం.. పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం, పుస్తకాలు, బట్టలు వంటివన్నీ ఉచితంగా ఇవ్వడం వల్ల వారిలో క్రమశిక్షణ, చదువుపై శ్రద్ధ తగ్గుతున్నాయని గరికపాటి అభిప్రాయపడ్డారు.

ముఖ్యంగా ఉపాధ్యాయులు తమ ప్రధాన వృత్తి అయిన బోధనను వదిలేసి, మధ్యాహ్న భోజనం వండించడం, గుడ్ల లెక్కలు రాయడానికే సమయం కేటాయిస్తున్నారని ఆయన విమర్శించినట్లు ఆ వీడియోలో ఉంది. విద్యాసంస్థలు విజ్ఞాన కేంద్రాలుగా ఉండాల్సింది పోయి, కేవలం భోజనశాలలుగా మారుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు పెట్టే గుడ్డును గాడిద గుడ్డు, శోభనం గదిలో పెళ్లికొడుకులా పిల్లలు భోజనం కోసం కూర్చుకుంటున్నారని అంటూ విమర్శలు వీడియోలో గరికపాటి అన్నట్లుగా షార్ట్ వీడియోలో కన్పిస్తోంది.

# రైతు కోసం.. బైక్‌పై మంత్రి!



**నల్లగొండ ,ఫ్లాష్ ఇండియా :** బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టద్వారా నల్లగొండ నియోజకవర్గంలోని ప్రతి చెరువును నింపి, ప్రతి ఎకరానికి సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తా అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం నల్గొండ మండలంలోని అప్పాజీపేట గ్రామంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన సాదాసీదాగా ద్విచక్ర వాహనం నడుపుతూ గ్రామంలోని సాగునీటి కాలువలను స్వయంగా పరిశీలించడం అందరినీ ఆకట్టుకుంది. మంత్రి కోమటిరెడ్డి కాలువల వెంట బైక్‌పై తిరుగుతూ నీటి పారుదల సౌకర్యాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో స్థానిక రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం అప్పాజీపేటలో కొండపాక గూడెం నుండి అప్పాజీపేట వరకు నూతనంగా నిర్మించనున్న పిల్ల కాలువ పనులకు శంకుస్థాపన చేసి, పనులను ప్రారంభించారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే తన ప్రధాన లక్ష్యం, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు కాలువల ద్వారా మండలంలోని అన్ని చెరువులను నింపుతాము. కొత్తగా చేపట్టిన పిల్ల కాలువ పనులను ఏమాత్రం రాజీ పడకుండా నాణ్యతతో, నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నీటి పారుదల శాఖ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసమే పది మంది...

**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా :** జీవన్ రెడ్డితో చర్చించిన అనంతరం మంత్రి శ్రీధర్ బాబు విలేకరులతో మాట్లాడారు. పార్టీకి సంబంధించిన ఏ విధమైన నిర్ణయం తీసుకోకండి అని జీవన్ రెడ్డిని కోరాం. జీవన్ రెడ్డికి పార్టీ అండగా నిలబడే ఆలోచన చేస్తుందని జీవన్ రెడ్డితో చర్చించిన అంశాలను పార్టీ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం అన్నారు. ఈ ప్రాంతానికి జీవన్ రెడ్డి ఒక పెద్దదిక్కు,అభివృద్ధి కోసమే 10 మంది ఎమ్మెల్యేలను తీసుకున్నాం. జీవన్ రెడ్డి గురించి తెలంగాణ రాష్ట్రంలో తెలియని వారు ఎవరు ఉండరు. ప్రతిపక్షంలో ఉన్న ప్రజల గొంతుకగా ఉన్న నాయకుడు జీవన్ రెడ్డి అని చెప్పక తప్పదు చెప్పుకొచ్చారు. జీవన్ రెడ్డి బాధపడితే మేము బాధపడ్డట్టే. కాంగ్రెస్ నాయకులు మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు జీవన్ రెడ్డితో గతంలో మాట్లాడారని.. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదురుకుంటున్న సమస్యలను జీవన్ రెడ్డి మా దృష్టికి తీసుకవచ్చారని ఆయన తెలిపారు.



# ఆ ఐదు రాష్ట్రాల్లో గెలుపెవరిది...?

లోక్ సభ ఎన్నికలు జరిగి సరిగ్గా రెండేళ్లు పూర్తయ్యాయి. మరో మూడేళ్లలో మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు జరుగుతాయి. అంటే వరుసగా మూడోసారి అధికారంలో కొనసాగుతున్న ఎన్డీఏ కూటమి పాలనకు దాదాపుగా సగం పూర్తైనట్టే. ఈ సమయంలో జరుగుతున్న రాష్ట్రాల ఎన్నికల్లో వచ్చే ఫలితాలు.. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు మూడ్‌ను నిర్దేశించవచ్చనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటిదాకా రాష్ట్రాల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి మెజార్టీ విజయాలు సాధించినా.. ఈసారి ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో విపక్ష పాలిత రాష్ట్రాలు కావడం.. అందులోనూ బీజేపీకి పట్టున్న రాష్ట్రాలు తక్కువగా ఉండటంతో.. ఈ ఎన్నికల ఫలితాలు అందరిలో ఆసక్తి రేపడం ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్రాల వారీగా ఎన్నికల పోరు చూస్తే.. అసోంలో మాత్రమే కాంగ్రెస్, బీజేపీ ముఖాముఖి పోటీ పడుతున్నాయి. బెంగాల్ లో బీజేపీ టీఎంసీ, కేరళలో కాంగ్రెస్ , లెఫ్ట్ కూటములు.. తమిళనాడులో త్రిముఖ పోటీ ఉంది. ఈ ఎన్నికలు కేవలం స్థానిక ప్రభుత్వాల మార్పుకే పరిమితం కాకుండా, కేంద్ర రాజకీయాల్లోనూ మార్పులు తీసుకురానున్నాయి. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం ఉన్న రాష్ట్రాల్లో జాతీయ పార్టీలు ఏ మేరకు పాగా వేస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పశ్చిమ బెంగాల్ పోరు మళ్ళీ దీదీ వర్సెస్ మోడీ గా మారింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ తన పదిహేనేళ్ల సంక్షేమ పథకాలు ,బెంగాలీ అస్తిత్వాన్ని నమ్ముకోగా, బీజేపీ అవినీతి , ప్రజల అసంతృప్తిని ప్రధాన అస్త్రాలుగా చేసుకుని బరిలోకి దిగుతోంది. గత ఎన్నికల కంటే ఈసారి బీజేపీ మరింత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండటంతో, బెంగాల్ గడ్డపై హోరాహోరీ పోరు తప్పేలా లేదు. ఇక్కడ చిన్నపాటి ఓట్ల చీలిక కూడా ఫలితాలను తలకిందులు చేసే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో దీదీకి ఓటమి రుచి చూపించిన సువేందు అధికారి.. ఈసారి భవానీపూర్‌లో మమతను ఢీకొడుతున్నారు.రాష్ట్రాల ఎన్నికలు అధికార బీజేపీ, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారాయి. ప్రస్తుతం అసోం, పుదుచ్చేరిలో మాత్రమే బీజేపీ కూటమి అధికారంలో ఉంది. ప్రధానమైన కీలక రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లను బీజేపీయేతర పార్టీలు పాలిస్తున్నాయి. ఈ రాష్ట్రాల్లోని అధికార పార్టీలు కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమికి మిత్రపక్షాలుగా వ్యవహరిస్తున్నాయి. ఇక్కడ మొత్తం పార్లమెంటు నియోజకవర్గాలను పరిగణనలోకి తీసుకుంటే 116 మంది ఎంపీలు ఉన్నారు. కానీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో వీటిలో బీజేపీ 24 మంది ఎంపీలను మాత్రమే గెలుచుకుంది. అధికసంఖ్యలో 92 మంది ఎంపీలను ఇండియా అలయన్స్ గెలుచుకుంది. దీంతో 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీకి ఈ ఎన్నికలు అతి పెద్ద పరీక్ష కాబోతున్నాయి. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఎదగడానికి, అధికారంలోకి రావడానికి బీజేపీ నిరంతరంగా ప్రయత్నాలు చేస్తోంది. ఇండియా కూటమిలోని మిత్రపక్షాలు ఆధిపత్యం చెలాయించే ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేక పోరాటం చేస్తోంది. 2024 పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ సొంతంగా అధికారం చేపట్టలేని పేలవమైన ఫలితాలు వచ్చినప్పటికీ... హర్యానా, మహారాష్ట్ర, ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో గొప్ప విజయాలు సాధించడమే కాకుండా తొలిసారి ముంబై నగరాన్ని కూడా కైవసం చేసుకుంది. ఈ ఊపులోనే ఇప్పుడు కూడా సత్తా చాటి.. దేశవ్యాప్తంగా తమకు పట్టుందని నిరూపించుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. అదే సమయంలో తమకు బలం ఉన్న రాష్ట్రాల్లో విజయం సాధించి.. ఎన్డీఏను నిలువరించాలనేది ఇండియా కూటమి పట్టుదలతో ఉంది.అసోం, కేరళ, పుదుచ్చేరిలో ఏప్రిల్ 9న ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడులో ఏప్రిల్ 23న ఎన్నికలు జరుగుతాయి. పశ్చిమబెంగాల్‌లో మాత్రం ఏప్రిల్ 23, 29న రెండు దశల్లో ఎన్నికలు జరుగుతాయి. అన్ని చోట్లా ఫలితాలు మాత్రం మే 4న వెలువడనున్నాయి. కాంగ్రెస్ కేరళలో గెలిచి అసోంలో తన సంఖ్యను మెరుగుపరుచుకుంటే సరిపోతుంది. కానీ, మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్ లో, స్టాలిన్ తమిళనాడులో తప్పక గెలిచి అధికారాన్ని నిలబెట్టుకోవాలి. ఓటమిపాలైతే అది వారికి పెద్ద ఎదురుదెబ్బ అవుతుంది. అంతేకాకుండా దీదీ, స్టాలిన్ ఓటమి.. ఇండియా కూటమికి కూడా పెద్ద ఓటమిగా నిలుస్తుంది. ఈ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ నామమాత్రమే కావడంతో.. ఉత్తరాది మాదిరిగా ఇక్కడ మిత్రులకు కాంగ్రెస్‌పై ఓటమి నెపం నెట్టేసే అవకాశం లేదు. బెంగాల్‌లో మమతా బెనర్జీ 2011 నుంచి వరుసగా మూడు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. మరోసారి ఆమె అధికారాన్ని నిలబెట్టుకుంటే ఇది వరుసగా ఆమెకు నాలుగో విజయం అవుతుంది. ప్రస్తుతం రాజకీయ పరిస్థితిని పరిశీలిస్తే మమతా బెనర్జీ విజయం ఖాయం అనేది టీఎంసీ అంచనా. పార్లమెంటు ఎన్నికల్లో టీఎంసీ భారీ విజయం సాధించిన తరుణంలో..బెంగాల్‌లో 30 శాతం కంటే ఎక్కువ ముస్లిం జనాభా ఉండటం కూడా మమతకు ఆధిపత్యం తెచ్చిపెడుతుందని ఆమె లెక్కలేసుకుంటున్నారు. ముస్లిం పాపులేషన్ దాదాపు 100 అసెంబ్లీ నియోజకవర్గాలను ఆధిపత్యంలో ఉంది. 2021లో 100 నియోజకవర్గాల్లో ముస్లిం ఓటర్లు 30 కంటే ఎక్కువమంది ఉన్నారు. మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ వాటన్నింటినీ గెలుచుకుంది. మరోసారి ఆ ఫీట్ రిపీట్ చేయటం కష్టం కాదనేది దీదీ ఆలోచన.కానీ బెంగాల్లో బీజేపీని తక్కువ అంచనా వేయటానికి గత ఎన్నికల్లో అనూహ్యంగా 77 సీట్లు గెలిచిన బీజేపీ.. ఏకంగా దీదీనే ఓడించి సంచలనం సృష్టించింది. అదే ఊపులో ఈసారి అధికారాన్ని ఒడిసిపట్టాలని గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే బెంగాల్లో జరిగిన సర్‌పై రాజకీయ దుమారం రేగింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన గంటల వ్యవధిలో బెంగాల్లో కీలక అధికారుల మార్పు, కేంద్ర బలగాల మోహరింపుపైనా భిన్నాభిప్రాయాలున్నాయి. ఈసారి బీజేపీ తమ సంఖ్యాబలాన్ని మెరుగుపరుచుకుంటుందని పరిశీలకులు భావిస్తున్నారు. తమిళనాడులో ప్రధాన పోటీ డీఎంకే, అన్నాడీఎంకే మధ్యే ఉన్నా.. ఇప్పుడు కొత్తగా రంగంలోకి వచ్చిన విజయ్ సాధించే ఓట్ల శాతంపై సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది. అదే సమయంలో ఆయన ఏ పార్టీ ఓట్లు చీల్చుతారనేది కూడా చూడాల్సి ఉంది. ప్రస్తుతం డీఎంకే 20 పార్టీలతో పొత్తు పెట్టుకుంది. తమిళనాడులో అధికార డీఎంకేకు ఎదురునిలిచే ప్రతిపక్షం విభజనకు గురైంది. ప్రముఖ నటుడు విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించడం తమిళనాడు ఎన్నికలకు అనిశ్చితిని జోడించింది. నటుడు విజయ్ డీఎంకే నుంచి ఓట్లను కొల్లగొట్టవచ్చని బీజేపీ కూటమి విశ్వసిస్తోంది. కానీ, తమిళనాడు ఓటర్లు నటుడు విజయ్ పట్ల ఎలా స్పందిస్తారో అనేది ఇంకా అస్పష్టంగానే ఉంది.తమిళనాడులో అతిపెద్ద పరిణామం ఏమిటంటే డీఎంకే, అన్నాడీఎంకే రెండింటి మిత్రపక్షాలతో సహా అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వంలో భాగస్వామ్యాన్ని కోరుతున్నాయి. ప్రస్తుతానికి డీఎంకే కూటమి ముందంజలో ఉన్నట్లు కనిపిస్తోంది. పార్లమెంటు ఎన్నికల్లోనూ తమిళనాడులోని 39 పార్లమెంటు స్థానాలను డీఎంకే కూటమే గెలుచుకుంది. మరోవైపు పార్టీ పునాదులు, పటిష్ఠ ఓటుబ్యాంకు సాయంతో పవర్లోకి రావాలని అన్నాడీఎంకే ప్రయత్నిస్తోంది. ఇందుకు బీజేపీ కూడా సహకారం అందిస్తోంది. కానీ విజయ్ ఓట్లే కీలకమౌతాయనే అంచనాలు ఏ పార్టీకి పూర్తి ధీమాను ఇవ్వలేకపోతున్నాయి. అసోం బీజేపీ పాలిత రాష్ట్రం. ఇక్కడ బీజేపీ బలంగా కనిపిస్తోంది. అయితే, బీజేపీ అస్సాంలో గత 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్నందున ప్రభుత్వ వ్యతిరేకత ఉంది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ రాజకీయంగా బలపడ్డారు. కానీ అసోంలో 32 శాతం మైనారిటీ జనాభా ఉంది. మైనారిటీ ఓటర్లు సాధారణంగా బీజేపీ వ్యతిరేకులు. దీంతో బీజేపీకి గెలుపు అంత తేలిక కాదనే ఉద్దేశంతో.. గౌరవ్ గొగోయ్ నేతృత్వంలో కాంగ్రెస్ గట్టి పోటీ ఇచ్చే ప్రయత్నం చేస్తోంది.అసోం చిన్న రాష్ట్రమైనప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఇది రాజకీయంగా కీలకమైనది. ఎందుకంటే ప్రస్తుతం ఎన్నికలు జరిగే నాలుగు రాష్ట్రాలు, ఓ కేంద్ర పాలిత ప్రాంతంలో.. బీజేపీ అధికారంలో ఉన్నది కేవలం అసోంలో మాత్రమే. బీజేపీ అధికారం నిలబెట్టుకోవాలంటే అసోంను గెలవాలి. ప్రస్తుతానికి ఇక్కడ బీజేపీ గెలుపు ఖాయమనే అంచనాలున్నా.. పోలింగ్ నాటికి ఏమైనా జరగొచ్చనే వాదన కూడా వినిపిస్తోంది. కాంగ్రెస్ కొంతకాలంగా రాజకీయ దూకుడు పెంచడంతో.. ఆ పార్టీకి అసోంలో ఉన్న పునాదులు దృష్టిలో పెట్టుకుని.. హస్తం అవకాశాల్ని పూర్తిగా కొట్టిపారేయలేని స్థితి. అక్రమ వలసల్ని ఆయుధంగా మలుచుకుని బీజేపీ కాంగ్రెస్‌పై పైచేయి సాధించే ప్రయత్నం చేస్తోంది. ఈ విషయంలో హిమంత గౌరవ్ గొగోయ్‌ను పూర్తిస్థాయిలో డిఫెన్స్‌లోకి నెట్టడానికి తీవ్రంగా ప్రయత్నించారు. అయితే గౌరవ్ దీటుగా కౌంటర్లు ఇవ్వడంతో.. ఓటర్లు ఏం చేస్తారనేది తేలాల్సి ఉంది. మొత్తం మీద అసోంలో రెండు జాతీయ పార్టీల ప్రధాన శక్తులుగా ఉండటంతో.. పోటీ గట్టిగానే ఉంటుందనేది పరిశీలకుల అంచనా.అసోం సీఎం హిమంత బిస్వ శర్మ సారథ్యంలో బిజెపి ధీమాగా ఉంది. మహాజోత్ కూటమి విచ్ఛిన్నం కావడం బిజెపికి కలిసి వచ్చే అంశం. కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ తన వ్యక్తిగత చరిష్మాతో బిజెపికి గట్టి పోటీ ఇస్తున్నారు. అయితే, అభివృద్ధి మంత్రం , హిందూత్వ కార్డుతో బిజెపి పైచేయి సాధించే అవకాశాలు ఉన్నాయని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. కేరళంలో బీజేపీ పెద్దగా పురోగతి సాధించి అధికారంలోకి వచ్చే అవకాశం లేదు. ప్రస్తుతం కేరళంలో బీజేపీకి 15 శాతం ఓట్లు ఉన్నాయి. అదేవిధంగా మరో 15 శాతం సానుభూతి ఓట్లు కూడా ఉన్నాయి. కేరళంలో ప్రధాన ప్రత్యర్థులు యూడీఎఫ్, ఎల్డీఎఫ్ మాత్రమే. క్రైస్తవులు, ముస్లింలు ప్రధానంగా కాంగ్రెస్ కూటమికి మద్దతు ఇస్తున్నారు. అయితే 60 శాతం ఉన్న హిందువులు లెఫ్ట్, బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఒకవేళ కాంగ్రెస్‌ను ఓడించడానికి బీజేపీ శ్రేణులు, హిందూ ఓటర్లు వ్యూహాత్మకంగా ఓటింగ్ చేయాలని భావిస్తే అది సీపీఎంకు కలిసొచ్చే అవకాశం అవుతుంది. మరోవైపు సీపీఎం కూటమి బలోపేతమైతేనే అధికారం నిలబెట్టుకుంటుంది. ఎందుకంటే ప్రస్తుతం కేరళలో కాంగ్రెస్ అధికారాన్ని చేజిక్కించుకునే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. అందువల్ల కేరళలో బీజేపీ అవకాశాలు పరిమితంగా ఉన్నాయి. కాంగ్రెస్ కూటమి విజయం సాధిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, కేరళలో కాంగ్రెస్ పార్టీకి కుమ్ములాటలే ప్రధాన సమస్య కావచ్చు. ఇక్కడ బీజేపీ నిలకడగా బలం పెంచుకుంటూ వస్తోంది. మొదటిసారిగా తిరువనంతపురం కార్పొరేషన్‌ను కూడా దక్కించుకుని జోష్‌లో కనిపిస్తోంది. కానీ దశాబ్దాలుగా పాతుకపోయిన యూడీఎఫ్, ఎల్డీఎఫ్ కూటముల్ని కేరళం ఓటర్లు వదులుకునే ప్రసక్తి లేకపోయినా.. ఈసారి బీజేపీ చీల్చే ఓట్లే విజేతను డిసైడ్ చేయొచ్చనే అంచనాలు లేకపోలేదు.సాధారణంగా కేరళంలో ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారుతుంటుంది, కానీ గత ఎన్నికల్లో పినరయి విజయన్ ఆ సంప్రదాయాన్ని చెరిపివేశారు. ఇప్పుడు ఎల్.డి.ఎఫ్ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించాలని చూస్తోంది. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ఈసారి ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని పట్టుదలతో ఉంది. బిజెపి ఇక్కడ బలమైన మూడో శక్తిగా ఎదగడానికి ప్రయత్నిస్తోంది. త్రిముఖ పోటీ జరిగే కొన్ని నియోజకవర్గాల్లో బిజెపి ఓట్లు ఎవరిని ముంచుతాయో అన్నది కీలకం. ప్రతి రాష్ట్రంలోనూ స్థానిక సమస్యలతో పాటు జాతీయ అంశాలు కూడా ఓటర్లపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు అటు అధికార పక్షానికి, ఇటు విపక్ష కూటమికి అత్యంత ప్రతిష్టాత్మకం కానున్నాయి. ఈ ఎన్నికల తీర్పు భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉంది. మొత్తం మీద నాలుగు రాష్ట్రాల్లో ఒక్కోచోట ఒక్కో రకంగా కనిపిస్తున్న రాజకీయ సమీకరణాలు.. ఉత్కంఠకు దారితీస్తున్నాయి. గతానికి భిన్నంగా ఈసారి తనకు అంతగా పట్టులేని ప్రతి రాష్ట్రంలోనూ బీజేపీ ఎంతోకొంత పోటీ ఇవ్వటానికి ప్రయత్నించడం కీలక పరిణామంగా చూస్తున్నారు. ఓవైపు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కు రాష్ట్రాల్లో ఓట్లు తగ్గుతున్న తరుణంలో.. తమ ఓటుబ్యాంకు పెంచుకోవటానికి ఇదే అదను అని బీజేపీ భావిస్తోంది. కానీ కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికీ బీజేపీ బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగలేకపోతోంది. కాకపోతే ఫలితాలతో సంబంధం లేకుండా ఎన్నికల్లో కడదాకా పోరాడటంలో ఆరితేరిన బీజేపీ.. ప్రత్యర్థులకు విజయం కేక్‌వాక్ కాదని నిరూపించే ప్రయత్నంలో ఉంది. గత లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణాది నుంచి ఎక్కువ సీట్లు ఆశించిన బీజేపీ.. ఆ మేరకు ఫలితాలు సాధించలేకపోయింది. కానీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణాది నుంచి మెరుగైన సీట్లు రావాల్సిందేనని భావిస్తున్న బీజేపీ.. అందుకు ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో పునాదులు వేసుకోవాలనే ఉద్దేశంతో కనిపిస్తోంది.పుదుచ్చేరిలో బీజేపీ కూటమి సీఎం ఎన్. రంగస్వామి ప్రభావం ఉంది. బలమైన పరిపాలనా వ్యవస్థ, ఓటర్ల బేస్‌ను బట్టి బీజేపీ కూటమి పుదుచ్చేరిని నిలుపుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కానీ మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరిలో ఏకైక ఎంపీ స్థానం దక్కించుకున్న కాంగ్రెస్.. పూర్తిగా ఆశలు వదులుకోలేదు. పుదుచ్చేరిలో ఎవరు గెలిచినా.. ఆ ప్రభావం పెద్దగా ఉండదనేది చరిత్ర చెబుతున్న సత్యం. మోదీ కొన్నాళ్లుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న బెంగాల్, తమిళనాడు, కేరళలో బీజేపీ బలం పుంజుకోవటం చాలా అవసరం. ఈ మూడు రాష్ట్రాల్లో ఒక్కచోట గెలిచినా.. తాము పెద్ద విజయం సాధించినట్టే అనేది కాషాయ పార్టీ వర్గాల మాట. కాంగ్రెస్ మాటకొస్తే.. ఆ పార్టీ కేరళంలో కచ్చితంగా గెలవాలి. ఎందుకంటే గాంధీ కుటుంబం పట్ల అక్కడ సానుకూలత ఎక్కువగా ఉంది. అలాగే అసోంలోనూ బీజేపీతో హోరాహోరీగా పోరు సాగించాలి. లేకపోతే కాంగ్రెస్ పుంజుకోవటం అంత తేలిక కాదనే ప్రచారం మళ్లీ ఊపందుకునే ప్రమాదం ఉంది.స్టాలిన్ తమిళనాడులో వరుసగా రెండవసారి అధికారంలోకి రావాలి. డీఎంకే ఓడిపోతే ఆ పార్టీ బలం తమిళనాడులో అతివేగంగా క్షీణించిపోతుంది. అదే సమయంలో అన్నాడీఎంకే ఈ ఎన్నికల్లో ఓడితే.. ఆ పార్టీ బలం కూడా తగ్గుతుందనడంలో సందేహం లేదు. ఇక కొత్తగా పార్టీ పెట్టిన విజయ్ రాజకీయ భవిష్యత్తును ఈ ఎన్నికలే నిర్ణయిస్తాయి. మమతా బెనర్జీ బెంగాల్లో గెలిస్తేనే జాతీయ రాజకీయాల్లో టీఎంసీ మాటకు విలువుంటుంది. లేకపోతే దీదీని ఎవరూ ఖాతరు చేయకపోవచ్చు. ఇలా ప్రతి రాష్ట్రమూ విడివిడిగా.. ఎన్నికలు జరిగే రాష్ట్రాలన్నీ కలిసికట్టుగా కూడా జాతీయ రాజకీయాలపై ప్రభావం చూపించే అవకాశం ఉండటమే.. ఈసారి ఎన్నికల ప్రత్యేకతగా చెబుతున్నారు. కాబట్టే ఈసారి అసెంబ్లీ సీట్ల సంఖ్య ఆధారంగా కాకుండా.. రాజకీయ సమీకరణాలు, ఫలితాలు చూపే ప్రభావం ఆధారంగా రాష్ట్రాల ఎన్నికల గురించి చర్చ జరుగుతోంది. ఎన్నికలు కేవలం అసెంబ్లీ ఫలితాలకే పరిమితమయ్యే అవకాశం లేదు. బీజేపీ విస్తరణ ఆకాంక్షలకు జనం మద్దతు ఉందా లేదా... కాంగ్రెస్ కు పూర్వవైభవం వచ్చే ఛాన్స్ ఉందా.. లేదా అనే విషయాలు తేల్చనున్నాయి. అసోం ఫలితాలు సీఏఏపై నిర్ణయాన్ని ప్రభావితం చేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదంటున్నారు విశ్లేషకులు. తమిళనాడులో డీఎంకే కూటమికి అధికారం వస్తే పర్వాలేదు.. అలా కాకుండా త్రిశంకు సభ ఏర్పడితే మాత్రం సరికొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీసినట్టే అవుతుంది.మొత్తం మీద ఈసారి రాష్ట్రాల ఎన్నికలు అన్ని పార్టీలనూ టెన్షన్ పెడుతున్నాయి. ఎందుకంటే రాజకీయ సమీకరణాలు సంక్లిష్టంగా ఉన్నాయి. ఏ పార్టీ కూడా గుండె మీద చేయి వేసుకుని ధీమాగా ఉండే పరిస్థితి లేదు. అలాగే ఏ పార్టీ కూడా రేసులో లేదని పూర్తిగా చెప్పే స్థితి కూడా కనిపించడం లేదు. అందరూ పోటీదారులే ఉన్నప్పుడు రేస్ కచ్చితంగా రసవత్తరంగానే ఉంటుంది. సహజంగా ప్రతిసారీ రాష్ట్రాల ఎన్నికల్లో పార్టీల ప్రచార వ్యూహాలే కీలకం. కానీ ఈసారి షెడ్యూల్ విడుదలకు ముందే మొదలైన రాజకీయం.. చాలా త్వరగానే రసపట్టులోకి వచ్చేసింది. పోలింగ్‌కు సరిగ్గా నెల రోజుల సమయం కూడా లేకపోవడంతో.. అన్ని పార్టీలు హడావుడిగా బలాబలాలు బేరీజు వేసుకుంటున్నాయి. కచ్చితంగా అధికారంలోకి వచ్చి తీరాలని ప్రతి పార్టీ తన క్యాడర్‌కు నూరిపోస్తోంది. కీలక నేతల భవితవ్యం కూడా ఈ ఎన్నికల్లో తేలిపోనుంది. గతంలో మాదిరిగా కాకుండా.. ఈసారి సరైన ఫలితాలు చూపించకపోతే.. కఠిన చర్యలు తప్పవని జాతీయ పార్టీలు కూడా స్థానిక నేతలకు గట్టిహెచ్చరికలు జారీ చేశాయి. దీంతో ఇదివరకటిలా సాకులు చెప్పే అవకాశం లేదు. ప్రచారంలో ఎన్నిరోజులైనా పాల్గొంటాం. ఎలాంటి సహాయసహకారాలైనా అందిస్తాం. మాకు మాత్రం విజయం తప్ప మరో మాట వినిపించొద్దని బీజేపీ నేతలకు మోడీ, అమిత్‌షా తేల్చిచెప్పేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ కూడా స్థానిక నేతలకు కీలక ఆదేశాలిచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి రాష్ట్రంలోనూ పోటీ చాలా గట్టిగా ఉన్న తరుణంలో.. ప్రతి ఓటునూ కీలకంగా తీసుకోవాలని పార్టీలు డిసైడయ్యాయి. అందుకే ఎవరు ఓటేయకపోయినా పర్లేదనే ధోరణికి కాలం చెల్లిందని అభిప్రాయపడుతున్నాయి.ఎవరేమనుకున్నా.. తమ రాజకీయ ఆధిపత్యం ప్రదర్శిస్తామని బీజేపీ ధీమాగా చెబుతోంది. కానీ ఈసారి కాషాయ పార్టీకి షాకిస్తామని కాంగ్రెస్ అంతే గట్టిగా చెబుతోంది. మరోవైపు జాతీయ పార్టీల విస్తరణవాదానికి అడ్డుకట్ట వేస్తామని ప్రాంతీయ పార్టీలు తొడ గొడుతున్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ జాతీయ, రాష్ట్ర స్థాయి అంశాలు సమాంతరంగా ప్రయాణిస్తున్నాయి. దీంతో పోలింగ్ నాటికి ఏ అంశాలు పైచేయి సాధించి.. ఏ పార్టీ పుట్టి ముంచుతాయనేది ఎవ్వరూ నిర్దిష్టంగా చెప్పలేకపోతున్నారు. అందుకే ప్రీపోల్ సర్వేలు కూడా ఓటరు నాడి పట్టలేక చేతులెత్తేస్తున్నాయి.

సంపాదకీయం పేజీలో రచనలు పంపవలసిన వాట్సప్ నంబర్ ,మెయిల్ ఐడి
9951512539
flashindia999@gmail.com

# జలమండలికి కోత..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ మహా నగరానికి తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ సంస్థ అయిన జలమండలికి రాష్ట్ర బడ్జెట్‌లో గతేడాది కన్నా ఈ సారి నిధులు తగ్గించారు. పథకాలు, లోన్లు కలిపి గతేడాది రూ.5,470 కోట్లు కేటాయిస్తే ఈ సారి రూ.3,305 కోట్లు కేటాయించారు. జలమండలి ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు రూ.1,450 కోట్లు కేటాయించించింది. కృష్ణా తాగునీటి పథకంలో భాగంగా చేపట్టిన సుంకిశాల ప్రాజెక్టు పనులు చేపట్టడానికి గత బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.3,085 కోట్లు కేటాయించింది. ఈ సారి ఈ ప్రాజెక్టు లోన్ కోసం రూ.1000 కోట్లు కేటాయించింది. ఇతర లోన్ల కోసం మరో రూ.555 కోట్లు కేటాయించింది. ఉచిత తాగునీటి పథకానికి గత ఏడాది రూ.300 కోట్లు ఇవ్వగా.. ఈ ఏడాది అంతే మొత్తంలో వెచ్చించనున్నారు.

**మూసీ పునరుజ్జీవనానికి రూ.1500 కోట్లు**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు రూ.1500 కోట్లు కేటాయించారు. గతేడాది రూ.1500 కోట్లు కేటాయించారు. అయితే 2024లో మూసీ ప్రాజెక్టులకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను గుర్తించి మార్కింగ్ చేయడంతోపాటు కొన్ని ఇండ్లను కూల్చేశారు. బాధితులందరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించారు. మొదటి దశలో ఉస్మాన్ సాగర్ నుంచి బాపుఘాట్, హిమాయత్ సాగర్ నుంచి బాపు ఘాట్ వరకు 21 కిలోమీటర్ల ప్రాజెక్టు చేపట్టడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**హెచ్ఎండీఏకు రూ.1500 కోట్లు**

రాష్ట్ర బడ్జెట్‌లో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)కి నిరాశే ఎదరైంది. గత రెండు బడ్జెట్ల కన్నా ఈ సారి ఎక్కువగానే కేటాయించింది. రూ.5 వేల కోట్ల నిధులు కేటాయించాలని హెచ్ఎండీఏ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కానీ ప్రభుత్వం మాత్రం రూ.1500 కోట్లను మాత్రమే కేటాయించింది. అయితే హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో చేపట్టనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్లు, రతన్ టాటా గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ఎలాంటి నిధులు కేటాయించలేదు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోన్ కోసం రూ.1000 కోట్లు, ఇతర ప్రా-జెక్టులకు సంబంధించిన లోన్లకు మరో రూ.500 కోట్లు కేటాయించింది.

**మెట్రోరైలుకు రూ.1100 కోట్లు**

హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.1100 కోట్లు కేటాయించారు. వీటిలో మొదటి దశ ప్రాజెక్టులో లోన్ కోసం రూ.500 కోట్లు కేటాయించింది. దీంతోపాటు మెట్రోరైలు రెండో దశ కోసం రూ.600 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లో పాతబస్తీలో చేపట్టిన మెట్రో నిర్మాణానికి రూ.500 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. హైడ్రాకు బడ్జెట్‌లో రూ.111.48 కోట్లు కేటాయించారు. ఎస్టాబ్లిష్‌మెంట్‌కు రూ.61.48 కోట్లు, డెవలప్‌మెంట్ పనుల కోసం రూ.50 కోట్లు కేటాయించింది.

# రెండో వాహనంపై 2% పన్ను రద్దు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఒకే వాహనదారుడికి ఉన్న రెండో వాహనానికి విధిస్తున్న ట్యాక్స్ ఇకపై ఉండదు. సెకండ్ వెహికిల్స్ కు వర్తించే అదనపు రెండు శాతం జీవితకాలపు పన్నును ప్రభుత్వం రద్దుచేసింది. ఇది ఈనెల 23 నుంచి అమల్లోకి రానుంది. రాష్ట్రంలో ఈ నెల 23న వాహన్ పోర్టల్ ను ప్రవేశపెడుతున్నందున అదేరోజు నుంచి సెకండ్ వెహికిల్ పై అదనపు ట్యాక్స్ రద్దవుతుందని రవాణా శాఖ అధికారులు తెలిపారు. జాతీయ పోర్టల్ వాహన్ తో అనుసంధానంతోనే వాహనదారులకు ఈ ప్రయోజనం కలుగుతుంది. సాధారణంగా ఒక వ్యక్తికి ఓ వాహనం ఉన్న తర్వాత.. మరో వాహనం కొనుగోలు చేస్తే రెండు శాతం అదనపు ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. ఇలా అదనపు ట్యాక్స్ చెల్లించే వారి సంఖ్య ప్రతి ఏడాది ఎక్కువగానే ఉంటున్నది. వాహన్ తో అనుసంధానమైతే ఈ ట్యాక్స్ జనరేట్ కాదు. రెండో వాహనంతో పాటు ఆ తర్వాత అదనంగా మరిన్ని వాహనాలు కొనుగోలు చేసినా అదనపు పన్ను ఉండదు. కానీ ప్రతి వాహనంపైనా లైఫ్ ట్యాక్స్ మాత్రం చెల్లించాల్సి ఉంటుంది.

**23 నుంచి వాహన్ పోర్టల్..**

రాష్ట్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు పారదర్శక, వేగవంతమైన, సులభమైన సేవలను అందించేందుకు 'వాహన్ పోర్టల్'ను ఈ నెల 23 నుంచి ప్రారంభిస్తున్నారు. ఈ పోర్టల్‌ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. ఈ వాహన్ పోర్టల్ ద్వారా దేశవ్యాప్త వాహనాల సమాచారం ఒకే చోట లభ్యమవుతుంది. వాహన్ తో అనుసంధానం ద్వారా తెలంగాణకు చెందిన వాహనాలు జాతీయ డేటాబేస్ లోకి వెళ్లనున్నాయి. ప్రస్తుత విధానంతో వాహన యజమాని చిరునామా, పేరు మార్పు, వాహన ఆర్సీ డూప్లికేట్ కాపీ వంటి సేవలు ఆన్ లైన్ లో అందుబాటులో లేవు. ఈ సేవల కోసం ఆర్టీఏ ఆఫీసులకు వెళ్లాల్సి ఉండేది. కానీ వాహన్ పోర్టల్ అనుసంధానం ద్వారా... ఈ తరహా సేవలన్నీ ఇక ఆన్‌లైన్‌లోకి వస్తాయి. ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంట్లో కూర్చుని ఆన్ లైన్ లో వాహనాల పనులను పూర్తి చేసుకునే వీలు ఉంటుంది. ఫలితంగా దళారుల ప్రమేయం లేకుండానే పనులన్నీ పూర్తిచేసుకోవచ్చు. అంతేకాకుండా పోలీసులకు వాహనాల వివరాలు తక్షణమే లభించడంతో నేర నియంత్రణకు కూడా ఇది తోడ్పడనుంది. రవాణా శాఖ అధికారులకు కూడా డేటా నిర్వహణ సులభమవుతుంది. వాహన సేవల కోసం 'వాహన్ పోర్టల్'ను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రవాణా రంగాన్ని పూర్తిగా డిజిటల్ వైపు మళ్లించే దిశగా ముందడుగు వేసినట్టయింది.



# ఎస్ఎల్‌బీసీలో భద్రతా ప్రమాణాలు పాటించాలి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనులు వేగవంతం అవుతున్నాయని.. భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమా-ర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం సెక్రటేరియట్‌లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్, డిండి ప్రాజెక్ట్, ఆచంపేట బ్రాంచ్ కాలువ పనులపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. టన్నెల్ ఇన్‌లెట్ వైపున తవ్వకాల పనులు తిరిగి ప్రారంభమయ్యాయని వెల్లడించారు. ఇప్పటికే దేవరకొండ అవుట్‌లెట్ వైపు పనులు ప్రారంభమైన నేపథ్యంలో ఇప్పుడు రెండు వైపులా తవ్వకాలు కొనసాగుతున్నాయని చెప్పారు. టన్నెల్ చివరి భాగం వరకు సరైన వెంటిలేషన్ ఉండేలా చూడాలని, నిరంతర పర్యవేక్షణతో కార్మికుల భద్రతకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌లెట్ వైపు 20 మీటర్ల ఓపెన్ కట్ పనులు పూర్తి చేసి అదనపు భద్రతా ఏర్పాట్లు చేసిన అనంతరం తవ్వకాలు పునఃప్రారంభించినట్లు తెలిపారు. గత నెల దేవరకొండ అవుట్‌లెట్ వైపున పనులు తిరిగి ప్రారంభించి మొదటి వారంలోనే ఏడు ఎక్స్‌కవేషన్ సైకిళ్ల ద్వారా సుమారు 20 మీటర్ల తవ్వకాలు చేపట్టినట్లు వివరించారు. మొత్తం 43.93 కిలోమీటర్ల పొడవున్న ఎస్ఎల్‌బీసీ టన్నెల్ అలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్‌లో కీలక భాగమని మంత్రి తెలిపారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం, సాంకేతిక పరిమితుల కారణంగా మధ్యలో యాక్సెస్ లేకుండా రెండు వైపులా తవ్వకాలు చేపడుతున్నామని చెప్పారు. పూ-ర్తయిన తర్వాత ప్రపంచంలోనే ఈ తరహాలో అతి పొడవైన టన్నెల్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. భూగర్భంలో క్వార్ట్జైట్, గ్రానైట్ రాళ్లు ఉండటం, 15 వాగులు దాటడం వంటి సవాళ్ల మధ్య పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. 2025 ఫిబ్రవరి 22న ఇన్‌లెట్ వైపున టన్నెల్ పైకప్పు కూలి నీరు, మట్టి ప్రవేశించి టన్నెల్ ముంపునకు గురైన ఘటనలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందిన విషయం గుర్తు చేశారు. ఆ ఘటన తర్వాత సాంకేతిక కమిటీ సిఫార్సుల మేరకు ఆధునిక టన్నెలింగ్ పద్ధతులను అమలు చేస్తున్నామని తెలిపారు. నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నిపుణులతో కలిసి హెలికాప్టర్ ఆధారిత జియోఫిజికల్ సర్వే నిర్వహించి భూగర్భ ప్రమాదాలను గుర్తించే ప్రయత్నం చేశామని చెప్పారు. ప్రముఖ టన్నెల్ నిపుణులతో సాంకేతిక కమిటీ ఏర్పాటుచేసి పనులను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. 2027 చివరినాటికి టన్నెల్ బ్రేక్‌త్రూ సాధించి, 2028 జూన్ నాటికి ప్రాజెక్ట్ పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ టన్నెల్ పూర్తయితే కృష్ణా నదీ జలాలను గ్రావిటీ ద్వారా తరలించి నల్గొండ జిల్లాలో సుమారు మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే కాకుండా ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీరు అందుతుందని చెప్పారు. ప్రస్తుతం అమలులో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ విధానంతో వచ్చే విద్యుత్ ఖర్చులో సంవత్సరానికి రూ.500 కోట్ల వరకు ఆదా అవుతుందని వివరించారు. పనుల్లో ఆలస్యం, నిర్లక్ష్యం అస్సలు సహించేది లేదని హెచ్చరించారు. పనుల పురోగతిని పరిశీలించేందుకు ఇరిగేషన్ శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్‌ను టన్నెల్ ప్రాంతానికి వెళ్లి పరిస్థితులు సమీక్షించాలని ఆదేశించారు.

# భవిష్యత్ హైదరాబాద్‌కు బ్లూప్రింట్..

## క్యూర్, హెచ్-సిటీ ప్రాజెక్టులకు భారీ కేటాయింపులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) ప్రాంతంలో టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, పరిశోధన, అభివృద్ధి స్టార్టప్, ఫైనాన్షియల్ సర్వీస్ సంస్థలు, ఇతర సర్వీస్ సెక్టార్లను అధిక విలువైన సేవల కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణలో పట్టణ జనాభా 2031 నాటికి 53.8 శాతానికి చేరుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో క్యూర్ ప్రాంత పరిధిని కాలుష్య రహితంగా (నెట్ జీరో) మార్చేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.

**హెచ్-సిటీ ప్రాజెక్టులకు రూ.2,654 కోట్లు**

క్యూర్ పరిధిలోని జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కార్పొరేషన్ల పరిధిలో ఫ్లైఓవర్లు, రోడ్లు, ఇతర మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపట్టడానికి ప్రభుత్వం రూ.2,654 కోట్లు కేటాయించింది. ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు హెచ్-సిటీలో రూ.7032 కోట్లతో 31 ఫ్లైఓవర్లు, 17 అండర్ పాసులు, 10 రోడ్లను విస్తరించాలని ప్రభుత్వం పనులు ప్రారంభించింది. అందులో భాగంగానే 2024-25 బడ్జెట్‌లో రూ.2,654 కోట్లు, 2025-26 బడ్జెట్‌లో రూ.2,654 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ బడ్జెట్‌లోనూ రూ.2,654 కోట్లు కేటాయించింది.

**కామన్ ఆర్గనైజేషన్**

మూడు మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సంస్థ, హైడ్రా వంటి సంస్థల అన్నింటినీ సమన్వయం చేసేందుకు ఒక సంస్థను ఏర్పాటు చేయడానికి తగిన చట్ట సవరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాత జీహెచ్ఎంసీ సంస్థకు ఉన్న అధిక వడ్డీ అప్పుల గురించి సంబంధిత బ్యాంకులతో చర్చించి, వడ్డీ రేటును 9.15 శాతం నుంచి 7.95 శాతానికి తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. దీంతో సంస్థకు ఎంతో ఉపశమనం లభించింది.

**స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్**

క్యూర్ కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ ప్రభుత్వం కేటాయించింది. ఎస్సీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ ద్వారా రూ.315 కోట్లు కేటాయించింది. దీంతోపాటు క్యూర్ పరిధిలోని పెట్రోల్, డీజిల్ ఆటోలను రెట్రో ఫిట్టింగ్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలుగా ప్రభుత్వ ఖర్చుతో మార్చాలని నిర్ణయించింది. దీని కోసం రూ.200 కోట్లు కేటాయించింది. వృత్తి పన్ను పరిహారం కింద రూ.10 కోట్లు కేటాయించింది. మోటారు వెహికల్ టాక్స్ పరిహారం కింద రూ.10 లక్షలను కేటాయించింది.

### కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి 'రామ్ రామ్'?



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో కీలక నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి పార్టీ మారుతున్నారనే ప్రచారం ఇప్పటికే ఊపందుకుంది. అయితే ఆ ప్రచారానికి తాజా పరిణామాలు మరింత బలాన్ని చేకూర్చుతున్నాయి. ఇవాళ రంజాన్ పర్వదినం సందర్భంగా ఆయన బీఆర్ఎస్ నేతలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొనడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రంజాన్ ప్రార్థనల సందర్భంగా జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, అనుచరులతో కలిసి కనిపించారు. అదేవిధంగా వారితో ఆత్మీయంగా ముచ్చటించడం చర్చనీయాంశమైంది. ఇది కేవలం పండుగ కలయికేనా లేక రాజకీయ మార్పుకు సంకేతమా.. అని పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. కాగా, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన నాటి నుంచి జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పార్టీలో తనకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని, దశాబ్దాల కాలంగా పార్టీని నమ్ముకున్న తన కంటే వలస వచ్చిన నేతలకే ఎక్కువ విలువ ఇస్తున్నారని ఆయన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, గత కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న జీవన్ రెడ్డి, తన అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆయన నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించడం ఆయన పార్టీ వీడటం ఖాయమనే సంకేతాలను ఇస్తోంది. తన రాజకీయ భవిష్యత్తుపై అనుచరులతో ఇప్పటికే చర్చలు జరిపిన జీవన్ రెడ్డి, ఉగాది పండుగ తర్వాత తన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తానని వెల్లడించారు. ఒకవేళ ఆయన బీఆర్ఎస్‌లో చేరితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ అని రాజకీయ పండితులు భావిస్తున్నారు.

# హర్మూజ్ జలసంధి వద్ద తగ్గిన ట్రాఫిక్..

## హర్మూజ్ జలసంధి నుంచి రెండు భారతీయ గ్యాస్ నౌకల ప్రయాణం..!




**ఢిల్లీ :** పశ్చిమాసియా ప్రాంతంలో గత కొన్ని రోజులుగా యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో సముద్ర మార్గంలో రాకపోకలు దాదాపుగా నిలిచిపోయాయి. ముఖ్యంగా ఇరాన్ పక్కన ఉండే 'హార్ముజ్ జలసంధి' సముద్ర మార్గం గుండా వెళ్లాలంటే ఓడలు భయపడుతున్నాయి. అయితే.. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లోనూ భారతదేశానికి చెందిన రెండు పెద్ద గ్యాస్ నౌకలు తమ ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించడానికి సిద్ధమవుతున్నాయి.

**ఏమిటా నౌకలు..? ఎక్కడున్నాయి..?**

భారతదేశానికి చెందిన 'పైన్ గ్యాస్', 'జగ్ వసంత్' అనే రెండు భారీ నౌకలు ప్రస్తుతం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని షార్జా తీరానికి సమీపంలో ఆగి ఉన్నాయి. ఇవి వంట గ్యాస్‌ను మోసుకెళ్లే నౌకలు. గత 24 గంటలుగా ఈ మార్గంలో చమురు రవాణా చేసే ఓడలేవీ కదలలేదు. కానీ... తాజా సమాచారం ప్రకారం ఈ రెండు భారతీయ నౌకలు శనివారం తమ ప్రయాణాన్ని మొదలుపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. నౌకల కదలికలను గమనించే సాఫ్ట్‌వేర్ల ద్వారా ఈ విషయం బయటపడింది.

**అసలు సమస్య ఏమిటి..?**

ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురు, గ్యాస్‌లో దాదాపు 20 శాతం ఈ హార్ముజ్ మార్గం గుండానే వెళ్లాలి. కానీ.. ఇరాన్ హెచ్చరికల వల్ల ఇక్కడ రాకపోకలు ఆగిపోయాయి. అమెరికా ఆంక్షలు ఉన్న ఒక ఖాళీ నౌకను కూడా ఇరాన్ వెనక్కి పంపించేసింది. ఇలాంటి సమయంలో మన నౌకలు ముందుకు వెళ్లడం అనేది చాలా కీలకమైన విషయం.

**భారత ప్రభుత్వం ఏమంటోంది..?**

మన దేశానికి చెందిన దాదాపు 22 నౌకలు ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఉన్నాయి. మన ఓడల భద్రత విషయంలో భారత ప్రభుత్వం చాలా జాగ్రత్తగా ఉంది. 'మా నౌకలు సురక్షితంగా, ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రయాణించాలని మేము కోరుకుంటున్నాము' అని భారత విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఇతర దేశాల నాయకులతో ఈ విషయంలో మాట్లాడుతున్నారు. గత వారంలో కూడా ఇరాన్ ప్రభుత్వం మన దేశానికి చెందిన రెండు గ్యాస్ నౌకలను వెళ్లడానికి అనుమతించింది. దీనిని బట్టి చూస్తుంటే.. ఇతర దేశాలతో పోలిస్తే భారతీయ నౌకలకు కొంత మినహాయింపు దొరుకుతుందని అర్థ-మవుతోంది. ఒకవేళ ఇప్పుడు ఈ రెండు నౌకలు సురక్షితంగా ప్రయాణిస్తే, రాబోయే రోజుల్లో మిగిలిన వ్యాపార నౌకలు కూడా ధైర్యంగా ముందుకు కదిలే అవకాశం ఉంటుంది.



### హుటాహుటిన జగిత్యాలకు మంత్రులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి పార్టీ మా-రుతున్నారనే ప్రచారంతో అప్రమత్తమైన అధిష్టానం బుజ్జగింపు చర్యలు ప్రారంభించింది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు ఇద్దరు మంత్రులు ఇవాళ జగిత్యాలలోని జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నేరుగా జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనతో సుదీర్ఘంగా సమావేశమ-య్యారు. గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న జీవన్ రెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు వారు గంటకు పైగా చర్చలు జరిపారు.

**పార్టీకి మీ సేవలు అవసరం.. మంత్రులు**

దశాబ్దాలుగా పార్టీకి అండగా ఉన్న మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీని వీడకూడదని మంత్రులు జీవన్ రెడ్డికి సూచించారు. సీనియర్ నేతగా మీ సేవలు పార్టీకి ఎంతో అవసరమని వారు స్పష్టం చేశారు. స్థానికంగా ఉన్న రాజకీయ ఇబ్బందులు, ఇతర అసంతృప్తులపై మంత్రులు ఆయనతో చర్చించారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి పార్టీలో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని గట్టి హామీ ఇచ్చారు. అయితే, ఈ సమావేశం ముగిసిన అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే జీవన్ రెడ్డి తాను పార్టీ మారే నిర్ణయాన్ని మార్చుకుంటారా.. లేదా అనేది సస్పెన్స్‌లా మారింది.

# ముక్క లేనిదే ముద్ద దిగదు!

## తెలంగాణలో నాన్‌వెజ్ 'జోరు'

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ముక్క లేనిదే ముద్ద దిగదు అనే సామెత మరోసారి నిరుపితం అయింది. తెలంగాణ రాష్ట్రంలో మాంసాహార ప్రియుల సంఖ్యతో పాటు ఉత్పత్తి కూడా రికార్డు స్థాయిలో పెరుగుతోంది. దశాబ్ద కాలంలోనే మాంసం వినియోగం ఐదింతలు పెరగడం గమనార్హం. తాజాగా రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబించే 'తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక - 2026' ఈ ఆసక్తికర గణాంకాలను వెల్లడించింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో మాంసం వినియోగం కేవలం 2.30 లక్షల టన్నులుగా ఉండగా, 2024-25 నాటికి అది ఏకంగా 11.01 లక్షల టన్నులకు చేరుకుంది.

**దేశంలోనే టాప్..**

పశుసంపద విషయంలో తెలంగాణ దేశవ్యాప్తంగా తన ప్రత్యేకతను చాటుకుంటోంది. గొర్రెల సంఖ్య విషయంలో దేశంలోనే తెలంగాణ తొలి స్థానంలో నిలిచింది. కోళ్ల పెంపకం, వినియోగంలో రాష్ట్రం దేశంలోనే మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. పశుసంపద విషయంలో 2019 గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుతం 3.26 కోట్లకు పైగా పశుసంపద ఉంది. ఇక, పదేళ్ల క్రితం 1,006 కోట్లుగా ఉన్న గుడ్ల వినియోగం, ఇప్పుడు 1,935.26 కోట్లకు పెరిగింది. పాల వినియోగం కూడా 39.24 లక్షల టన్నుల నుంచి 59.35 లక్షల టన్నులకు వృద్ధి చెందింది. మొత్తానికి, అటు ఉత్పత్తిలోనూ, ఇటు వినియోగంలోనూ తెలంగాణ రాష్ట్రం దూసుకుపోతోందని సామాజిక ఆర్థిక నివేదిక స్పష్టం చేస్తోంది.

# మొయినాబాద్ డ్రగ్స్ కేసు..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌ను రెవెన్యూ అధికారులతో కలిసి సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీ వ్యవహారంతో పాటు భూ అక్రమాల అంశం కూడా ఇప్పుడు తెరపైకి రావడంతో ఈ కేసు విచారణ వేగవంతమైంది. మొయినాబాద్‌లోని రోహిత్ ఫామ్‌హౌస్ గత కొంతకాలంగా వివాదాలకు నిలయంగా మారింది. తాజాగా రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అసైన్డ్ భూమిలో ఈ ఫామ్‌హౌస్‌ను నిర్మించారని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. ఈ నిబంధనల ఉల్లంఘన నేపథ్యంలోనే ఫామ్‌హౌస్‌ను స్వా-ధీనం చేసుకుని సీజ్ చేశారు.

**పోలీసుల కఠిన చర్యలు..**

డ్రగ్స్ పార్టీ జరిగిన సమయంలో అక్కడికి వచ్చిన వారి వాహనాలను సైతం పోలీసులు ఇప్పటికే సీజ్ చేశారు. ఆ వాహనాల య-జమానులు ఎవరు.. పార్టీకి ఎవరెవరు హాజరయ్యారు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక విచారణ బృందం కోర్టు తీర్పు అనంతరం రోహిత్ రెడ్డిని కస్టడీలోకి తీసుకోనుంది. అనంతరం ఆయన్ని నేరుగా ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి, అక్కడ జరిగిన పార్టీ వివరాలు, ఇతర ఆధారాల కోసం క్షేత్రస్థాయిలో విచారించనున్నట్లుగా సమాచారం.

# కుల్సుంపురాలో ఫుడ్ స్కాం బట్టబయలు..



- హైదరాబాద్ కుల్సుంపురాలో భారీ ఫుడ్ స్కాం బట్టబయలు
- కుళ్లిన పదార్థాలతో సమోసాలు, పఫ్స్ తయారీ
- ప్రముఖ హోటళ్లకు సరఫరా చేస్తున్న నిందితుడు
- అబ్దుల్ రషీద్ (73) అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- H-FAST, టాస్క్‌ఫోర్స్, పోలీసులు సంయుక్త దాడులు
- రూ.5 లక్షల విలువైన నాసిరకం పదార్థాల స్వాధీనం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ లోని కుల్సుంపురా ప్రాంతంలో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు, పఫ్స్ తయారు చేసి నగరంలోని ప్రముఖ హోటళ్లకు సరఫరా చేస్తున్న నిందితుడిని అధికారులు అరెస్ట్ చేశారు. అబ్దుల్ అనే వ్యక్తి అపరిశుభ్ర వాతావరణంలో నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేసస్తున్నట్లు దర్యాప్తులో బయటపడింది. ముఖ్యంగా కుళ్లిపోయిన గుడ్లతో ఎగ్ పఫ్స్ తయారు చేసి హోటళ్లకు పంపిస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసిన వెంటనే అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పెద్ద మొత్తంలో పాడైన, నాసిరకం ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఎఖీూూ అధికారులు కేసు నమోదు చేసి అబ్దుల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనతో కుల్సుంపురా ప్రాంతంలో తయారవుతున్న ఫుడ్ ఐటమ్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండలని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోను హైదరాబాద్ పోలీసులు సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారవుతున్న ఆహారం కనపడుతుంది. హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వేలేన్స్ టీం , టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, కులసుంపుర పోలీస్ సమన్వయంతో ఈ దాడి చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా నిర్వహించిన ఈ దాడిలో 73 ఏళ్ల అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా సమోసాల తయారీ యూనిట్ నిర్వహిస్తున్నట్లు బయటపడింది. అతనికి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టీ క్లియరెన్స్ ఏదీ లేకపోవడం గమనార్హం. దర్యాప్తులో భాగంగా కుళ్లిపోయిన గుడ్లు, పలుమార్లు వాడిన వంటనూనె వంటి నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ యూనిట్‌లో అపరిశుభ్ర పరిస్థితుల్లో సమోసాలు, ఇతర ఫుడ్ ఐటమ్స్ తయారు చేసి నగరంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తేలింది. దాడి సమయంలో సుమారు రూ. 5 లక్షల విలువైన నాసిరకం ఆహార పదార్థాలు, ముడి సరుకులు, యంత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో వివిధ రకాల సమోసాలు, మైదా, స్వీట్ కార్న్ వంటి ముడి పదార్థాలు కూడా ఉన్నాయి. నిందితుడు అబ్దుల్ రషీద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేశారు. హైదరాబాద్ సిటీ పోలీసులు ఆహార కల్తీపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని సూచించారు. హోటళ్లకు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతపై కఠినంగా పర్యవేక్షణ కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.



# మియాపూర్ లో దారుణం..

- మియాపూర్‌లో మహిళపై కత్తితో దాడి ఘటన
- తనను కాదని మరో వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కోపం కారణం
- బాధితురాలు నూకరత్నం - హౌస్‌కీపింగ్ ఉద్యోగి

**మియాపూర్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలోని మియాపూర్ ప్రాంతంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. తనను కాదని మరో వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కోపంతో ఓ మహిళపై కత్తితో దాడి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. కాకినాడకు చెందిన నూకరత్నం అనే మహిళ మియాపూర్‌లో హౌస్‌కీపింగ్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తోంది. గతంలో భర్తను కోల్పోయిన ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవలే గత నెల 20న ప్రసాద్ అనే వ్యక్తిని ఆమె వివాహం చేసుకుంది. ఇదే సమయంలో నూకరత్నం పనిచేసే చోట వంటమనిషిగా పనిచేస్తున్న ఆలీషా అలియాస్ పాండు ఆమెపై కక్ష పెంచుకున్నాడు. తనకు తెలియకుండా ప్రసాద్‌ను పెళ్లి చేసుకోవడం కారణంగా అతడు ఆగ్రహానికి గురైనట్లు సమాచారం. ఈ నెల 19న ఆలీషా తన తండ్రి లాలూ, స్నేహితుడు జాన్‌తో కలిసి నూకరత్నం ఇంటికి వెళ్లాడు. తన వెంట రావాలని ఆమెతో వాగ్వాదానికి దిగాడు. అయితే నూకరత్నం నిరాకరించడంతో కోపంతో వెంట తీసుకువచ్చిన కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఈ దాడిలో నూకరత్నం తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే స్పందించి ఆమెను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స కొనసాగుతోంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు ఆలీషా అలియాస్ పాండు, అతని తండ్రి లాలూను అరెస్ట్ చేశారు.

# చిట్కూల్ లో వెల్లువిరిసిన మత సామరస్యం..!

**పటాన్ చెరు,ఫ్లాష్ ఇండియా :** కులం, మతం ఏదైనా మానవత్వం ఒక్కటేనని, భారతీయులందరూ సోదరభావంతో మెలగాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్ చార్జి నీలం మధు ముదిరాజ్ పేర్కొన్నారు. శనివారం రంజాన్ పండుగ పురస్కరించుకుని చిట్కుల్ మైనార్టీ సోదరులు నీలం మధు ముదిరాజ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఒక అరుదైన ఘటన కు చిట్కుల్ గ్రామం వేదికగా నిలిచింది. నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో చిట్కుల్‌లో జరుగుతున్న నూతన శ్రీ రామచంద్రస్వామి ఆలయ ప్రతిష్టా కార్యక్రమాలు జరుగుతున్న వేదిక వద్ద పూజా పనుల్లో నిమగ్నమై ఉన్న నీలం మధును పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు మర్యాద పూర్వకంగా కలిశారు. హిందూ ధర్మ సంప్రదాయాల ప్రకారం.. దేవాలయ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్న తరుణంలో సంప్రదాయ దుస్తులలో ఉన్న నీలం మధు వద్దకు ముస్లిం సోదరులు చేరుకోవడం మత సామరస్యానికి అద్దం పట్టింది. వారిని సాదరంగా ఆహ్వానించిన నీలం మధు, ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ, పండుగలు ఏవైనా అవి మనుషుల మధ్య దూరాన్ని తగ్గించి, ప్రేమాభిమానాలను పెంచేవిగా ఉండాలని ఆకాంక్షించారు. ఒకవైపు రామాలయ పునఃప్రతిష్ట జరుగుతుండగా, అదే సమయంలో ముస్లిం సోదరులు వచ్చి రంజాన్ శుభాకాంక్షలు పంచుకోవడం గంగా-జమునా తెహజీబ్‌కు నిదర్శనమని ఆయన కొనియాడారు. భక్తి మార్గాలు వేరైనా లక్ష్యం ఒక్కటేనని, అందరూ కలిసిమెలిసి ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దేవాలయ ప్రాంగణంలో చోటుచేసుకున్న ఈ ఆత్మీయ కలయిక స్థానికుల్లో అమితమైన ఆనందాన్ని నింపింది. రాజకీయాలకు అతీతంగా, అందరినీ కలుపుకుని పోయే నీలం మధు తీరును గ్రామస్తులు, ముస్లిం పెద్దలు ప్రశంసించారు.



# తాగునీరు లేక అరిగోస పడుతున్న గ్రామ ప్రజలు

**బిజినేపల్లి,ఫ్లాష్ ఇండియా :** నాగర్ కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం, వెలిగొండ గ్రామంలో తాగునీటి కోసం ఐదారు రోజుల నుంచి అవస్థలు పడుతున్న గ్రామ పాలకులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం కావడంతో ఉగాది పండుగ కంటే రెండు రోజుల నుంచే తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న పట్టించుకోకపోవడంతో గ్రామంలోని ప్రజలు నిత్యవసరాలకు, మూగజీవాలకు తాగునీటి ఇబ్బంది తీవ్రంగా నెలకొందని గ్రామ సర్పంచ్ వాటర్ ట్యాంక్‌ను వీధుల గుండా పంపించారు. అయినప్పటికీ నీరు సరిపోకపోవడంతో కాలనీవాసులు అయోమయంలో ఉన్నామన్నారు. మిషన్ భగీరథ నీరు ట్యాంకులకు ఎక్కిన పైప్ లైన్ ప్రాబ్లంతో వారం రోజుల నుంచి తాగునీటి సమస్య నెలకొందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. తాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరుతున్నారు.

# మానవ అక్రమ రవాణా బండారం బట్టబయలు..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్,ఫ్లాష్ ఇండియా :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో మానవ అక్రమ రవాణా మరోసారి వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. అమాయక గిరిజన యువతులను లక్ష్యంగా చేసుకున్న అంతరాష్ట్ర ముఠా, పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పి ఇతర రాష్ట్రాలకు అమ్మేస్తున్న దారుణం బయటపడింది. తాజాగా బెజ్జూర్ మండలంకు చెందిన ఇద్దరు గిరిజన యువతులను మధ్యప్రదేశ్‌కు అక్రమంగా విక్రయించిన కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంచిర్యాలలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న ఈ యువతులను టార్గెట్ గా చేసుకుని ముఠా సభ్యులు మోసం చేసినట్లు విచారణలో తేలింది. ఈ కేసులో చెన్నూరు మండలం కిష్టంపేటకు చెందిన ప్రశాంత్, సవిత దంపతులు, అలాగే సిరోంచాకు చెందిన మహేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు రాహుల్ పరారీలో ఉన్నాడు. ఒక్కో యువతిని రూ. 2.50 లక్షలకు విక్రయించి, డబ్బులను నలుగురు సభ్యులు పంచుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. గతేడాది జూన్‌లో ఈ యువతులు ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. అనంతరం సెప్టెంబర్‌లో అదృశ్యం కేసు నమోదు కాగా, దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాధితులను రక్షించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పోడు వ్యవసాయం తప్ప జీవనాధారం లేని పరిస్థితిని దుర్వినియోగం చేస్తూ.. “ఉద్యోగం, మంచి జీవితం, పెళ్లి” అంటూ మోసగిస్తున్న ఈ ముఠాలు గిరిజన మహిళలను అంగట్లో సరుకుల్లా అమ్మేస్తున్నాయి. మైనర్ బాలికలు, వివాహితులు, ఒంటరి మహిళల కోసం వేర్వేరు రేట్లు నిర్ణయించి అక్రమ రవాణా కొనసాగిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇదే జిల్లాలో గతంలోనూ ఇలాంటి కేసులు నమోదయ్యాయి. కొన్ని ముఠాలు మహిళలను మధ్యప్రదేశ్ కు తరలించి వ్యభిచారంలోకి నెట్టిన ఘటనలు బయటపడ్డాయి. పోలీసులు ఈ ముఠా కార్యకలాపాలపై లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.



# తల్లి మందలింపు..

**మహబూబాబాద్,ఫ్లాష్ ఇండియా :** పాఠశాలకు వెళ్లి చదువుకోవాలి అని మందలించిన తన తల్లికి ఓ బాలుడు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చాడు. క్రిమిసంహారక మందు సేవించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పూసల తండాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామదాసు, స్వప్నల చిన్న కుమారుడు పవన్(10) నాలుగోవ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటుండడంతో బడికి వెళ్లాలి అంటూ ఆ బాలుడిని తల్లి మందలించడంతో ఈనెల 11వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగినట్లు వారు తెలిపారు. మరుసటి రోజు బాలుడికి వాంతులు తీవ్ర జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే మానుకోట ప్రభుత్వాసుపత్రికి తరలించి, అత్యవసర వైద్య చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, పది రోజులు చికిత్స పొందుతూ ఈ రోజు ఆ బాలుడు మృతి చెందాడు. పవన్ మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఫేక్ ప్రొఫైల్స్ ఉచ్చులో అమ్మాయిలు..


**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అరచేతిలో ఇమిడిపోయే స్మార్ట్‌ఫోన్.. ఇప్పుడు ఎంతో మంది ఆడపిల్లల పాలిట శాపంగా మారుతోందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్ వేదికగా ఆసక్తికర విషయం షేర్ చేశారు. సోషల్ మీడియా వినియోగం పెరిగాక అపరిచితులతో ఏర్పడుతున్న పరిచయాలు యువతులను ఊహించని ప్రమాదాల్లోకి నెట్టేస్తున్నాయని అన్నారు. ఇటీవల కాలంలో ఈ తరహా విషాదకర ఘటనలు తన దృష్టికి ఎక్కువగా వస్తున్నాయని, ఆ కథనాలు చూశాక ఎంతో బాధనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**అందమైన యువకుల ఫోటోలతో నకిలీ ఖాతాలు**

సైబర్ నేరగాళ్లు అందమైన యువకులు లేదా సినీ నటుల ఫోటోలను డీపీలుగా పెట్టుకుని నకిలీ ఖాతాలతో అమ్మాయిలకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి వాటిలో ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతున్నారని తెలిపారు. ఆ మాయమాటలకు ఆకర్షితులై కొందరు ఆడపిల్లలు వారిని గుడ్డిగా నమ్మి తమ వ్యక్తిగత ఫోటోలను, వీడియోలను పంచుకుంటున్నారని అన్నారు. అలా పంపగానే ఆ అపరిచితులు రాక్షసులుగా మారిపోయి వాటిని అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని అన్నారు. వాటిని మార్ఫింగ్ చేసి డబ్బులు కావాలని, భౌతికంగా కలవాలని వేధింపులకు గురిచేస్తున్నారని ట్వీట్‌లో రాసుకొచ్చారు. పరువు పోతుందన్న భయంతో, ఈ విషయాన్ని ఇంట్లో చెప్పలేక కొందరు అమ్మాయిలు అడిగినంత డబ్బులు ముట్టజెబుతూ తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారన్నారు. ఈ వేధింపులు తాళలేక కొందరు తమ ప్రాణాలను సైతం తీసుకుంటున్నారని ఆవేదన చెందారు.

**ఆడపిల్లలకు నేను చేసే విజ్ఞప్తి ఒక్కటే..**

‘ఆడపిల్లలకు నేను చేసే విజ్ఞప్తి ఒక్కటే.. మీకు ఆన్‌లైన్‌లో ఇలాంటి సమస్య లేదా అన్యాయం ఎదురైతే అస్సలు భయపడకండి. ఆ సైబర్ నేరగాళ్ల బ్లాక్ మెయిలింగ్‌కు లొంగవద్దు, మీ ప్రాణాలు తీసుకోవద్దు. వెంటనే ఈ విషయాన్ని మీ తల్లిదండ్రులకు లేదా స్నేహితులకు చెప్పండి. ఏమాత్రం సంకోచించకుండా డయల్ 100 కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వండి. మీకు అండగా పోలీసులు ఎల్లప్పుడూ ఉంటారు. తల్లిదండ్రులు సైతం పిల్లలతో కాస్త సమయం గడుపుతూ, వారు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారు,




ఎవరితో మాట్లాడుతున్నారు అనేదానిపై ఓ కన్నేసి ఉంచండి. ఫేక్ ప్రొఫైల్స్, ఫేక్ నెంబర్లు, వీపీఎన్‌లు వాడితే పోలీసులకు చిక్కం అని సైబర్ నేరగాళ్లు భ్రమపడొద్దు. మీరు ఎక్కడున్నా సరే పట్టుకొచ్చి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. ఆడపిల్లలు సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉంటూ, అన్యాయం జరిగితే ధైర్యంగా ముందుకు రావాలని కోరుతున్నాను’ అని సీపీ సజ్జనార్ ట్వీట్ చేశారు.

# 37మంది అదుపులోకి!?



**వనస్థలిపురం,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్, ఎల్బీనగర్ నియోజకవర్గంలో హుక్కా సెంటర్లపై ఎల్బీనగర్ డివిజన్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఎల్బీనగర్, నాగోల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు హుక్కా సెంటర్లను లక్ష్యంగా చేసుకుని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సేహరి కేఫ్ హుక్కా సెంటర్‌పై పోలీసులు దాడులు నిర్వహించి భారీగా హుక్కా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఎల్బీనగర్‌లోని ఎల్వోసీ హుక్కా సెంటర్‌పైనా రెయిడ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ.. ‘ఎల్బీనగర్, నాగోల్ పరిధిలోని ఎల్వోసీ, సేహరి కేఫ్ లలో లో హుక్కా సెంటర్లు నడుపుతున్నారని విశ్వసనీయ సమాచారంతో పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని తెలిపారు. ఇక్కడ హుక్కా సెంటర్ అనధికారికంగా, చట్ట విరుద్ధంగా నడిపిస్తున్నారు. హుక్కా పార్ట్స్, సంబంధిత మెటీరియల్, పైపులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నాగోల్‌లో సుమారు 20 మంది, ఎల్బీనగర్‌లో 17 మంది హుక్కా తాగుతూ పట్టుబడ్డారు. వీళ్లంతా బంజారాహిల్స్, మాసబ్ ట్యాంక్, బండ్లగూడ, ఎల్బీనగర్ చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి యువత వచ్చి ఇక్కడ హుక్కా సేవిస్తున్నారు.

నాగోల్ సేహరి హుక్కా కేఫ్‌లో ఒక్కసారి హుక్కా తాగితే రూ. 700 వసూలు చేస్తున్నట్లు వారు చెప్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే హుక్కా సెంటర్లను బ్యాన్ చేసింది. అయినప్పటికీ నాగోల్‌లో కౌశిక్ అనే వ్యక్తి ఈ హుక్కా సెంటర్ నడుపుతున్నట్లు తెలిసింది. ఈ దాడుల్లో మొత్తం 37 మందిని అదుపులోకి తీసుకున్నాం. ఎల్వోసి హుక్కా సెంటర్‌లో 12 మంది యువకులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రక్త నమూనాలను సేకరించాం. సేకరించిన నమూనాల నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకుంటాం’ అని ఏసీపీ కృష్ణయ్య తెలిపారు.



# విద్యుత్ వైర్ తగిలి లారీ దగ్ధం

**షాద్ నగర్,ఫ్లాష్ ఇండియా :** టపాసుల లోడుతో వెళ్తున్న లారీకి ప్రమాదవశాత్తు విద్యుత్ హై టెన్షన్ వైర్ తగలడంతో అగ్నిప్రమాదం సంభవించి లారీ దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్ల రహదారిలో శనివారం మధ్యాహ్నం టపాసుల లోడుతో వెళ్తున్న లారీకి 130కేవీ విద్యుత్ హైటెన్షన్ వైరు తగలడంతో మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. లారీలో టపాసులలోడు ఉండడంతో మంటలు భారీగా చెలరేగి లారీ పూర్తిగా దగ్ధమైంది. జరిగిన అగ్నిప్రమాద వివరాలను అటుగా వెళుతున్న వాహనదారులు విద్యుత్, అగ్నిమాపక, పోలీస్ అధికారులకు తెలియజేశారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు.

# కొండగట్టు అంజన్నను దర్శించుకున్న కేంద్ర సహాయ మంత్రి



**కొండగట్టు,ఫ్లాష్ ఇండియా :** కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం శనివారం రోజున ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గత శనివారం నిర్వహించిన అంజన్న ఆశీర్వాద యాత్ర సందర్భంగా స్వామి వారి సన్నిధికి చేరుకునే సరికి ఆలస్యం కావడంతో ఆలయం మూసి వేశారు. దీంతో ఆయన ఆలయ ముఖ ద్వారం వద్దనే మొక్కు చెల్లించున్నారు. కాగా ఈ రోజు మళ్ళీ ఆయన స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బండి సంజయ్ ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేసి, అనంతరం గర్భగుడిలోకి ప్రవేశించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శాలువాతో సన్మానించి ఆశీర్వచనాన్ని, స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, నాయకులు బోయిన్పల్లి ప్రవీణ్ రావ్, బండ రమణారెడ్డి, మల్యాల మండలాధ్యక్షుడు గాజుల మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, సంకుర్తి తిరుపతి, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, బోట్ల ప్రసాద్, పొనగంటి రమేష్, కొల్లూరు గంగాధర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# మానవత్వం చాటుకున్న హెడ్ కానిస్టేబుల్

**టేకుమట్ల,ఫ్లాష్ ఇండియా :** టేకుమట్ల మండల స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ అనుముల మల్లయ్య మరియు వారి తోటి స్నేహితులు గ్రామస్తుల సహకారంతో ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నారు. నిత్యం ప్రజల రక్షకుడిగా ప్రజా సైనికుడిలా పనిచేసే మనసున్న వ్యక్తిగా అనాధగా మిగిలిన ఆడబిడ్డలకు ఆసరాగా నిలిచి గొప్ప మనసు చాటుకున్నారు. వెలిశాల గ్రామానికి చెందిన బోయిని ఝాన్సీ ఇటీవల క్యాన్సర్ వ్యాధితో మృతి చెందగా వారి కుటుంబానికి 30 వేల రూపాయల ఆర్థిక సహాయం స్థానిక ఎస్సై అమూల్య చేతుల మీదుగా ఝాన్సీ కుమార్తెకు అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్న హెడ్ కానిస్టేబుల్ అనుముల మల్లయ్యను ఎస్సై అమూల్య అభినందించారు.

# వాటంన్నింటికీ దూరంగా ఉండు..




మార్చి 28 నుంచి ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ మొదలు కాబోతుంది. దీనికోసం అన్ని జట్లు వారి కొత్త సహచరులతో కలిసి ప్రాక్టీస్ మొదలు పెట్టేశాయి. కొత్త ఏడాది.. కొత్త సీజన్.. కొత్త అంచనాలు. ప్రతిసారి సీజన్ మొదలు కాకముందు నుంచే ఎన్నో ఎక్స్పెటేషన్స్. ఇందులో ఈసారి అందరి దృష్టి 14 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశిపై ఉందనడం ఎటువంటి అతిశయోక్తి లేదు. చిన్న వయసులోనే అద్భుతమైన బ్యాటింగ్ తో క్రికెట్ ప్రపంచాన్ని తనవైపు తిప్పుకున్న ఈ ఎడమచేతి బ్యాట్స్‌మన్, భారీ సిక్సర్లు కొట్టడంలో ప్రత్యేక గుర్తింపును సంపాదించాడు. 2025 ఐపీఎల్ సీజన్‌కు రాజస్థాన్ రాయల్స్ రూ. 1.1 కోట్ల భారీ మొత్తంతో వైభవ్ ను కొనుగోలు చేయడం అప్పుడు సంచలనం సృష్టించింది. అయితే మేనేజ్మెంట్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అతడు 7 మ్యాచ్‌ల్లో 252 పరుగులు సాధించి, 36 సగటుతో 206.56 స్ట్రైక్ రేట్‌తో అబ్బురపరిచాడు. జట్టులో సంజు శాంసన్ గాయపడితే అతడికి బదులుగా జట్టులోకి వచ్చిన వైభవ్.. ఆ అవకాశాన్ని అద్భుతంగా ఉపయోగించుకున్నాడు. గుజరాత్ టైటాన్స్ పై తన రెండో మ్యాచ్ లోనే ఏకంగా 35 బంతుల్లో శతకం బాది, ఐపీఎల్ చరిత్రలో అత్యంత పిన్న వయసులో సెంచరీ చేసిన ఆటగాడిగా, అలాగే అత్యంత వేగంగా శతకం సాధించిన భారతీయ ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఇక అది అంత గతం. ఈ ఏడాదిలో జరిగిన అండర్-19 వరల్డ్ కప్ లో కూడా వైభవ్ రెచ్చిపోయాడు. ఐసీసీ అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్ 2026 ఫైనల్లో ఇంగ్లండ్ పై కేవలం 80 బంతుల్లో 175 పరుగులు చేసి, భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. దీనితో ఇప్పుడు ఐపీఎల్ 2026లో వైభవ్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ స్పందిస్తూ.. వైభవ్ పై ఒత్తిడి పడకుండా చూడాలని తాను ప్రయత్నిస్తున్నట్లు అన్నారు. ఈసారి హైప్, ప్రెషర్ సహజమే.. కానీ ఆ ఒత్తిడిని యశస్వి జైస్వాల్ తీసుకుంటాడు. వైభవ్ కేవలం స్వేచ్ఛగా ఆడితే చాలు అని పేర్కొన్నారు. అంతేకాదు మీడియా దృష్టి నుంచి దూరంగా ఉంచి, అతడు సహజంగా ఆటను ఆస్వాదించేలా చేస్తానని కెప్టెన్ తెలిపారు. దీనితో సీజన్ మొదలు కాకముందే వైభవ్ సూర్యవంశీకి కెప్టెన్ నుండి ఓ వార్నింగ్ అందుకున్నట్లు అయ్యింది.

# బీసీసీఐ నన్ను నిర్లక్ష్యం చేసింది.. రాజీనామా చేస్తున్నా






భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI)లో జరుగుతున్న పరిణామాలు ఇప్పుడు క్రీడా లోకంలో తీవ్ర చర్చకు దారితీశాయి. టీమిండియా మాజీ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ స్వయంగా బోర్డుపై సంచలన ఆరోపణలు చేస్తూ కామెంటరీ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం కలకలం రేపుతోంది. గత రెండు దశాబ్దాలుగా తన గొంతుకతో అభిమానులను అలరించిన ఆయన, తన పట్ల వర్ణ వివక్ష చూపారని ఆరోపించారు.

**ఆవేదనకు కారణం ఇదే..**

సుమారు 23 ఏళ్లుగా బ్రాడ్‌కాస్టింగ్ రంగంలో ఉన్నప్పటికీ.. బీసీసీఐ తనను కావాలనే విస్మరించిందని శివరామకృష్ణన్ వాపోయారు. ముఖ్యంగా అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో టాస్ వేయడం, అవార్డు ప్రజెంటేషన్ వంటి కీలక బాధ్యతలను తన కంటే జూనియర్లకు అప్పగించారని, తన రంగును బట్టి తనను పక్కన పెట్టారని ఆయన సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రపంచవ్యాప్తంగా నాకు గౌరవం దక్కింది కానీ, నా స్వదేశంలోనే వివక్షను ఎదుర్కొన్నాను' అని ఆయన పేర్కొన్నారు. మాజీ కోచ్ రవిశాస్త్రి హయాంలో కూడా పిచ్ రిపోర్ట్ వంటి బాధ్యతలకు కొత్తవారికే ప్రాధాన్యత ఇచ్చారని, సీనియర్‌గా ఉన్న తనను కనీసం పరిగణనలోకి తీసుకోలేదని ఆయన విమర్శించారు. ఎవరికో దాసోహం అయ్యి తన ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేనని, అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందిస్తూ వద్దని వారించినప్పటికీ, శివరామకృష్ణన్ మాత్రం తన నిర్ణయానికే మొగ్గు చూపారన్నారు. ఈ పరిణామం భారత క్రికెట్ వర్గాల్లో పెను సంచలనంగా మారింది.



# మరి స్టార్ట్ చేద్దామా..

మార్చి 28 నుంచి ఐపీఎల్ 2026 సీజన్ మొదలు కాబోతోంది. ఇందులో భాగంగా బెంగళూరులోని చిన్న స్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మొదటి మ్యాచ్ జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ గా ఆర్సిబి జట్టు బరిలోకి దిగనుంది. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ పలు కారణాల వల్ల సీజన్ ఆరంభంలో పలు మ్యాచ్ లకు దూరం కానున్నారు. దీంతో జట్టు యాజమాన్యం రెండు రోజుల క్రితం కొత్త కెప్టెన్ ను ప్రకటించింది. ఇషాన్ కిషన్ ను సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు తాత్కాలిక కెప్టెన్గా ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రెండుసార్లు టోర్నీ గెలిచిన జట్టును ఇషాన్ కిషన్ ఎలా ముందుకు తీసుకెళ్తాడు అని క్రికెట్ విశ్లేషకులు చర్చిస్తున్నాను. ఇదిలా ఉండగా.. తాజాగా సన్ రైజర్స్ హైదరాబాద్ ఇషాన్ కిషన్ పెట్టి కొత్త టీజర్ ను సోషల్ మీడియాలో విడుదల చేసింది. ఇందులో "గత ఏడాది కొత్త చాప్టర్ మొదలైంది. ఇక్కడికి నేను ఒక ఆటగాడిగా వచ్చాను. కానీ ఈరోజు నేను మీ మనిషిగా తిరిగి వచ్చాను. అది కూడా ఆరెంజ్ ఆర్మీ కెప్టెన్ గా" అంటూ ఇషాన్ కిషన్ మాట్లాడడం వినవచ్చు. ఇక ఇదే వీడియోలో చివర్లో "ఇక స్టార్ట్ చేద్దామా.. అంటూ మిగతా జట్లకు ఓ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చేలా మెసేజ్ ఇచ్చాడు. అలాగే "ఫైర్ హెచ్చరిక" అంటూ ఎండ్ టైటిల్ తో యాజమాన్యం టీజర్ ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. చూడాలిమరి సన్ రైజర్స్ హైదరాబాద్ సీజన్ లో ఎలా ముందుకు వెళ్తుందో.

# పంజాబ్ అయ్యేనా కింగ్స్?



పంజాబ్ అయ్యేనా ఐపీఎల్ చరిత్రలో ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేకపోవడం పంజాబ్ కింగ్స్ నిలకడలేని ఫామ్‌ను ఎత్తి చూపుతోంది. ఇప్పటిదాకా జరిగిన మొత్తం 18 సీజన్‌లలో ఈ జట్టు రెండుసార్లు (2014, 2025) మాత్రమే ఫైనల్‌కు వచ్చింది. అయితే, గత సంవత్సరం జట్టును సమూలంగా ప్రక్షాళించడం పంజాబ్‌కు కలిసి వచ్చింది. ముఖ్యంగా శ్రేయాస్ అయ్యర్‌ను భారీ ధరకు దక్కించుకుంది. అంతేకాదు అతడికి జట్టు పగ్గాలు అప్పగించింది. తనపై వెచ్చించిన మొత్తానికి, ఫ్రాంచైజీ యాజమాన్యం ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా శ్రేయాస్ అయ్యర్ జట్టును నిరుడు తుదిపోరుకు తీసుకొచ్చాడు. ఈనేపథ్యంలో ప్రధాన ఆటగాళ్లను రిటైన్ చేసుకున్న పంజాబ్ రన్నర్‌పగా నిలిచిన ఆత్మవిశ్వాసంతో ఈ సీజన్‌కు సై అంటోంది. మరి.. శ్రేయాస్ సారథ్యంలో పంజాబ్ ఈసారైనా 'కింగ్స్' అవుతుందా..?

**బలం**

విదేశీ ఆల్‌రౌండర్లు పంజాబ్‌కు ప్రధాన బలం. మార్కస్ స్టొయినిస్, మార్కో యాన్సెన్, అజ్మతుల్లా ఒమర్జాయ్, మిచెల్ ఒవెన్, కూపర్ కానొలీ బంతిని ఎంత బలంగా బాది భారీ షాట్లు సాధించగలరో..అదే బంతితో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టగలరు. పైగా ప్రపంచ వ్యాప్తంగా పలు అంతర్జాతీయ ఫ్రాంచైజీ లీగ్‌లలో ఆడుతున్న అపార అనుభవం ఆ ఐదుగురు ఆల్‌రౌండర్ల సొంతం. ప్రియాన్ష్ ఆర్యా, ప్రభ్‌సిమ్రన్ సింగ్ దూకుడైన బ్యాటింగ్‌తో స్కోరుబోర్డును పరుగులు పెట్టించగలరు. నిరుడు 400కుపైగా రన్స్ చేసిన ఆర్యా రెండో బెస్ట్ స్ట్రయిక్ రేట్ బ్యాటర్‌గా నిలిచాడు. ఓపెనర్లు ఇచ్చిన శుభారంభాలను కొనసాగించేందుకు శ్రేయాస్ ఎలాగూ ఉంటాడు. అర్ష్‌దీప్, ఫెర్గూసన్, యాన్సెన్, చాహల్‌తో పేస్, స్పిన్ బౌలింగ్‌లో వైవిధ్యం పంజాబ్‌కు కలిసి వచ్చే అంశం. పటిష్టమైన రిజర్వ్ బెంచ్ అదనపు బలం.

**బలహీనత**


పెద్దగా అనుభవంలేని భారత ఆటగాళ్లు జట్టులో ఉండడం పంజాబ్ కింగ్స్ బలహీనత. కెప్టెన్ అయ్యర్ మినహా ప్రియాన్ష్, శశాంక్ సింగ్, వధేరా, హర్‌ప్రీత్ బ్రార్, ముషీర్ ఖాన్, వైశాఖ్‌లకు అత్యున్నత స్థాయి ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడింది తక్కువ. వీరందరిలో ప్రతిభకు కొదవ లేకపోయినా నిలకడగా రాణించలేకపోవడం, ఒత్తిడి సమయాల్లో ఆడిన అనుభవం పెద్దగా లేకపోవడం కీలక సమయాల్లో జట్టును దెబ్బతీస్తోంది. అలాగే చాహల్ మినహా పేరు కలిగిన మరో స్పిన్నర్ లేకపోవడం లోటు.

**జట్టు**

**స్వదేశీ ఆటగాళ్లు:** శ్రేయాస్ (కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్యా, ప్రభ్ సిమ్రన్ సింగ్ (కీపర్), నేహాల్ వధేరా, శశాంక్ సింగ్, విజయ్ కుమార్ వైశాఖ్, అర్ష్‌దీప్ సింగ్, యుజువేంద్ర చాహల్, హర్‌ప్రీత్ బ్రార్, సూర్యాన్ష్ షెగ్డే, విష్ణు వినోద్ (కీపర్), యశ్ ఠాకూర్, ముషీర్ ఖాన్, హర్నూర్ సింగ్, పైలా అవినాశ్, ప్రవీణ్ దూబే, విశాల్ నిషాద్.

**విదేశీ ఆటగాళ్లు:** స్టొయినిస్, యాన్సెన్, అజ్మతుల్లా ఒమర్జాయ్, జేవియర్ బార్ట్‌లెట్, మిచెల్ ఒవెన్, ఫెర్గూసన్, కూపర్ కానొలీ, బెన్ డ్వార్షుయిస్.

# బిజినెస్




## ఐఫోన్ యూజర్లకు కొత్త టెన్షన్..

ఐఫోన్ వినియోగదారులను వణికించే మరో ప్రమాదకరమైన స్పైవేర్ వెలుగులోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో ఉన్న ఐఫోన్లను లక్ష్యంగా చేసుకుని 'డార్క్ స్వార్డ్' అనే అత్యంత శక్తివంతమైన స్పైవేర్ దాడి చేస్తోందని భద్రతా పరిశోధకులు హెచ్చరించారు. గూగుల్, లుకౌట్, ఐ-వెరిఫై సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఈ మాల్వేర్ ఇన్ఫెక్ట్ అయిన వెబ్‌సైట్ల ద్వారా వేగంగా వ్యాపిస్తోందని చీణుం పేర్కొంది. దీని సాయంతో హ్యాకర్లు వినియోగదారుల ఫోన్ల నుండి అత్యంత సున్నితమైన వ్యక్తిగత డేటాను దొంగిలిస్తున్నట్లు నిపుణులు గుర్తించారు. సౌదీ అరేబియా, టర్కీ, మలేషియా, ఉక్రెయిన్ వంటి దేశాల్లోని ప్రముఖ వ్యక్తులే లక్ష్యంగా ఈ దాడులు జరుగుతున్నాయని గూగుల్ వెల్లడించింది. ముఖ్యంగా ఉక్రెయిన్‌కు చెందిన వార్తా వెబ్‌సైట్లు మరియు ప్రభుత్వ సంస్థల సైట్లలో ఈ మాల్వేర్‌ను నిక్షిప్తం చేసినట్లు సమాచారం. ఆ సైట్లను సందర్శించిన వారి ఫోన్ల నుండి సమాచారాన్ని సేకరించేందుకు హ్యాకర్లు దీనిని వాడుతున్నారు. ఈ స్పైవేర్ వెనుక కొన్ని వాణిజ్య సంస్థలతో పాటు, ప్రభుత్వ మద్దతు ఉన్న హ్యాకర్ల హస్తం కూడా ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

**క్రిప్టోకరెన్సీ వాలెట్లు ఖాళీ?**

ఇటీవలే వెలుగులోకి వచ్చిన కొరునా అనే మరో స్పైవేర్‌తో కలిసి ఈ 'డార్క్ స్వార్డ్' పనిచేస్తోంది. ఈ రెండు హ్యాకింగ్ టూల్స్ కలిస్తే క్రిప్టోకరెన్సీ వాలెట్లను ఖాళీ చేయడంతో పాటు, ఫోన్‌లోని పూర్తి వ్యక్తిగత సమాచారాన్ని హ్యాకర్ల చేతుల్లో పెట్టగలవని పరిశోధకులు చెబుతున్నారు. అయితే.. ఈ మాల్వేర్ తాజా ఐఓఎస్ వెర్షన్లపై ప్రభావం చూపనప్పటికీ, ఐఓఎస్ 18 వెర్షన్ వాడుతున్న ఫోన్లపై సమర్థవంతంగా పనిచేస్తోంది. ప్రస్తుతానికి మార్కెట్లో దాదాపు పావు వంతు ఐఫోన్లు పాత ఓఎస్ వెర్షన్లపైనే నడుస్తుండటంతో ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉంది. గతంలో కూడా ఆపిల్ పరికరాల్లో ఇలాంటి భద్రతా లోపాలు తలెత్తాయి. గత ఏడాది మే నెలలో ఎయిర్ ప్లే ఫీచర్‌లోని లోపాన్ని ఉపయోగించుకుని ఒకే వైఫై నెట్‌వర్క్‌లో ఉన్న డివైజ్‌లను హ్యాక్ చేసే అవకాశం ఉందని గుర్తించారు. అలాగే ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా అత్యంత అధునాతన దాడుల ద్వారా లాక్ చేసిన ఐఫోన్లలో 'యూఎస్‌బీ రెస్ట్రిక్టెడ్ మోడ్'ను నిలిపివేసే ప్రయత్నం జరిగిందని ఆపిల్ స్వయంగా వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఐఫోన్ వినియోగదారులు తమ ఫోన్లను వెంటనే లేటెస్ట్ సాఫ్ట్‌వేర్ వెర్షన్‌కు అప్‌డేట్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# టెలికాం రంగంలో కీలక పరిణామం..




ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నెట్‌వర్క్ పరిధిని మరింత విస్తరించుకోవాలనే లక్ష్యంతో వోడాఫోన్ ఐడియా ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ చేతులు కలుపబోతోంది. ఈ రెండు సంస్థలు తమ వద్ద ఉన్న టెలికాం టవర్లు, ఆప్టికల్ ఫైబర్ స్పెక్ట్రమ్ వంటి వనరులను ఒకరికొకరు పంచుకోవడంపై చర్చలు ప్రారంభించాయి. మౌలిక సదుపాయాలను పంచుకోవడం వల్ల నెట్‌వర్క్ నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుందని, ఇది ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రెండు సంస్థలకు ఎంతో ఊరటనిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ బలంగా ఉండగా.. పట్టణ ప్రాంతాల్లో వొడాఫోన్ ఐడియా మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయి. ఈ ఒప్పందం కుదిరితే రెండు సంస్థల వినియోగదారులకు మెరుగైన సిగ్నల్, డేటా సేవలు అందుతాయి. జియో, ఎయిర్‌టెల్ వంటి దిగ్గజ సంస్థలతో పోటీ పడటానికి ఈ సహకారం అత్యంత కీలకం కానుంది. అయితే, ఈ ఒప్పందంపై తుది నిర్ణయం పూర్తిగా వాణిజ్యపరమైన అంశాలపై ఆధారపడి ఉంటుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

**వోడాఫోన్ ఐడియాకు 20.5 కోట్ల వినియోగదారులు..**

ప్రస్తుతం దేశవ్యాప్తంగా వోడాఫోన్ ఐడియా సుమారు 20.5 కోట్ల మేర వినియోగదారులను కలిగి ఉంది. దేశంలో అతిపెద్ద ప్రైవేట్ టెలికాం ఆపరేటర్‌గా కొనసాగుతోంది. ఇందులో యాక్టివ్ కస్టమర్లు 19.3 కోట్లుగా ఉంగా.. మార్కెట్ వాటా 17.5 శాతం నుంచి 18 శాతం ఉంది. గత కొన్ని ఏళ్లుగా జియో, ఎయిర్‌టెల్ నుంచి ఎదురవుతున్న తీవ్ర పోటీ వల్ల వోడాఫోన్ ఐడియా ప్రతి నెలా సగటున 10 లక్షల నుంచి 20 లక్షల వరకు వినియోగదారులను కోల్పోతూ వస్తోంది. వోడాఫోన్ ఐడియా వినియోగదారులలో మెజారిటీ భాగం ఇంకా 4జీ నెట్‌వర్క్‌లోనే ఉన్నారు. ఇటీవల నిధుల సేకరణ తర్వాత 5+ సేవలను విస్తరించడం ద్వారా వినియోగదారులను నిలుపుకోవాలని సంస్థ ప్రయత్నిస్తోంది. ఇక ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ కు సుమారు 9.5 కోట్లు మంది వినియోగదారులు ఉండగా, మార్కెట్ వాటా 8 శాతం నుంచి 8.5 శాతంగా ఉంది. వైర్డ్ బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్లు 40 లక్షలకు పైగా ఉండటం విశేషం.



# బంగారం, వెండి ధరలు ఇలా!

పశ్చిమాసియా యుద్ధం కారణంగా చమురు, గ్యాస్ సంక్షోభం తలెత్తింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రభావం బంగారం, వెండి ధరలపై కూడా ఉంటుందని భయాందోళన చెందారు. కానీ అందుకు భిన్నంగా ధరలు దిగొస్తున్నాయి. యుద్ధం ప్రారంభమైన దగ్గర నుంచి బంగారం, వెండి ధరలు దిగొచ్చాయే తప్ప అంతగా పెరిగిన దాఖలాలు లేవు. తాజాగా మరోసారి దిగొచ్చాయి. ఈరోజు తులం గోల్డ్‌పై రూ. 100 తగ్గగా.. కిలో వెండిపై రూ. 100 తగ్గింది. మొత్తానికి పెళ్లిళ్ల సీజన్‌లో మగువలకు.. సామాన్యులకు శుభవార్తగానే చెప్పొచ్చు. తులం గోల్డ్‌పై రూ. 100 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 1,48,900 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ. 10 తగ్గడంతో రూ. 1,36,540 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ. 10 తగ్గడంతో రూ. 1,11,720 దగ్గర ట్రేడ్ అవుతోంది. సిల్వర్ ధర కూడా ఊరట కలిగించింది. కిలో వెండి ధరపై రూ. 100 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి రూ. 2,54, 900 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ. 2,59,900 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, బెంగళూరులో మాత్రం కిలో వెండి ధర రూ. 2,54, 900 దగ్గర అమ్ముడవుతోంది.

# పెరగనున్న టాటా కార్ల ధరలు..



టాటా మోటార్స్ కార్లు కొనాలనుకునే వారికి బిగ్ అలర్ట్. ప్రముఖ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్, తన పెట్రోల్ , డీజిల్ కార్ల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ పెంచిన ధరలు ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి రానున్నాయి. కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం.. సగటున 0.5 శాతం మేర ధరలు పెరగనున్నాయి. అయితే.. మీరు ఎంచుకునే కారు మోడల్ , వేరియంట్‌ను బట్టి ఈ ధరల పెంపులో మార్పులు ఉండవచ్చు. అంటే కొన్ని కార్లపై తక్కువగా, మరికొన్నింటిపై కొంచెం ఎక్కువగా ప్రభావం ఉండవచ్చు. కేవలం పెట్రోల్, డీజిల్ వాహనాలకు మాత్రమే ఈ పెంపు వర్తిస్తుంది.


**ధరలు ఎందుకు పెరుగుతున్నాయి..?**

కార్లు తయారు చేయడానికి ఉపయోగించే ముడి పదార్థాల (స్టీల్, అల్యూమినియం వంటివి) ధరలు పెరగడం, రవాణా ఖర్చులు ఎక్కువ కావడమే దీనికి ప్రధాన కారణం. ఈ అదనపు భారాన్ని కొంతవరకు తగ్గించుకోవడానికే కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. మార్కెట్‌లో ఇతర కంపెనీలతో పోటీని దృష్టిలో ఉంచుకుని, సామాన్యులపై మరీ ఎక్కువ భారం పడకుండా చాలా తక్కువ మొత్తంలోనే ధరలు పెంచుతున్నట్లు టాటా మోటార్స్ స్పష్టం చేసింది.

**ఏ ఏ కార్లపై ప్రభావం ఉంటుంది..?**

టాటా మోటార్స్‌కు చెందిన ప్రముఖ మోడల్స్ అయిన హ్యాచ్‌బ్యాక్, సెడాన్ , ఎస్‌యూవీ విభాగాల్లోని అన్ని పెట్రోల్, డీజిల్ కార్లకు ఈ కొత్త ధరలు వర్తిస్తాయి. మీరు మార్చి నెలాఖరులోపు కారు బుక్ చేసుకుంటే పాత ధరలకే పొందే అవకాశం ఉండవచ్చు.

# దురంధర్ 2 ఒక మాస్టర్ పీస్



టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ ఎస్.ఎస్. రాజమౌళి తాజాగా విడుదలైన 'ధురంధర్: ద రివెంజ్' చిత్రంపై తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. సినిమా చూసిన అనంతరం ఆయన చిత్ర బృందాన్ని అభినందించారు.

### స్కేల్ అండ్ సోల్ అద్భుతం

"నాకు ధురంధర్-1 అంటే చాలా ఇష్టం, కానీ 'ద రివెంజ్' మాత్రం స్కేల్ పరంగానూ, సోల్ పరంగానూ మొదటి భాగాన్ని మించిపోయింది" అని రాజమౌళి పేర్కొన్నారు. సినిమాలోని రచన, నటీనటుల ఎంపిక, సాంకేతిక పనితీరు, సంగీతం, దర్శకత్వం అన్నీ అత్యున్నత ప్రమాణాలతో ఉన్నాయని ఆయన ప్రశంసించారు. దర్శకుడు ఆదిత్య ధర్ గురించి చెబుతూ.. "ఏకంగా 4 గంటల నిడివి ఉన్న సినిమాను తీసి విడుదల చేయాలంటే చాలా గుండె ధైర్యం ఉండాలి. కానీ ప్రేక్షకులు చివరి ఫ్రేమ్ వరకు సీటుకే అతుక్కుపోయేలా చేయడంలో మీరు సఫలమయ్యారు. ఆదిత్య ధర్.. మీరు ఈ సినిమాతో సిక్సర్ కొట్టారు" అని అభినందించారు.ఇక నటీనటుల నటన గురించి రాజమౌళి ప్రత్యేకంగా ప్రస్తావించారు. "రణవీర్.. ఏమా పర్ఫార్మెన్స్ అది! ఆ షెడ్‌లో చెల్లెలితో వచ్చే సీన్ నటనకు ఒక మాస్టర్ క్లాస్. హంజా, జస్కీరత్ పాత్రల్లో మమ్మల్ని మంత్రముగ్ధులను చేశారు" అని పేర్కొన్నారు. "ఒక దేశం ఎదుర్కొంటున్న నిస్సహాయతను, అసహనాన్ని మాధవన్ తన నటనలో అద్భుతంగా పండించారు. స్క్రీన్‌పై ఆయన విజయాన్ని మా సొంత విజయంగా భావించాం." అని జక్కన్న తెలిపారు. సినిమాలోని ఎమోషనల్ పాయింట్స్, అదిరిపోయే ప్లాట్ ట్విస్ట్‌లు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని రాజమౌళి తన పోస్టులో చెప్పుకొచ్చారు.




# పాతబస్తీ బ్యాక్ డ్రాప్‌లో 'గల్లీ'

టాలెంటెడ్ హీరో సుధీర్ బాబు కూడా డిజిటల్ ఎంట్రీకి సిద్ధం అయ్యాడు. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా రాబోతున్న ఈ సరికొత్త వెబ్ సిరీస్ 'గల్లీ' అనే టైటిల్‌తో తెరకెక్కుతోంది. ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహిస్తుండగా.. ఆర్కా మీడియా వర్క్స్ నిర్మిస్తోంది. తాజాగా ఈ సినిమా అనౌన్స్ చేస్తూ హీరో ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. హైదరాబాద్‌లోని పాతబస్తీ గల్లీల నేపథ్యంలో ఒక 'మోడరన్-డే వెస్ట్రన్' డ్రామాగా ఈ కథను రూపొందించారు. ఒక హై-స్టేక్స్ గల్లీ క్రికెట్ మ్యాచ్ జరగడానికి ముందు రోజు రాత్రి చోటుచేసుకునే ఉత్కంఠభరిత పరిణామాలు, నేరస్థులు, పోలీసులు, ఆటగాళ్ల మధ్య సాగే దోబూచులాట ఈ సిరీస్‌కు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇందులో సుధీర్ బాబు మునుపెన్నడూ చూడని విధంగా చాలా రఫ్ అండ్ మాస్ లుక్‌లో కనిపించబోతున్నారు. ఈ సిరీస్‌లో సీనియర్ నటుడు జె.డి. చక్రవర్తి, హన్సిక మోట్వానీ, శ్రద్ధా శ్రీనాథ్, ఆదర్శ్ బాలకృష్ణ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ త్వరలోనే స్ట్రీమింగ్ కాబోతుంది. ఇక రిలీజ్ చేసిన పోస్టర్ ప్రజెంట్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతున్నది.




# 'బిచ్చగాడు' కాంబో రిలీజ్..

విజయ్ ఆంటోని కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన చిత్రం 'బిచ్చగాడు'. శశి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ 2016 రిలీజై మంచి సక్సెస్‌ను అందుకుంది. తన తల్లి ప్రాణాల కోసం ఓ బిలియనీర్ 48 రోజుల పాటు బిచ్చగాడిగా మారే కథాంశంతో, భావోద్వేగాలతో ఈ సినిమా ప్రతి ఒక్క ప్రేక్షకుడిగా ఎంతగానో ఆకట్టుకుంది. దీంతో విజయ్ ఆంటోని, డైరెక్టర్ శశి కాంబోకు మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఇప్పుడు ఇన్నేళ్లకు ఈ కాంబో మరోసారి పట్టాలెక్కుతోంది. విజయ్ ఆంటోని, డైరెక్టర్ శశి కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ చిత్రం 'నూరు సామి'. ఇది తెలుగులో 'వంద దేవుళ్లు'గా రాబోతున్నది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హీరో మంచు విష్ణు తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ.. 'ఇది నిజమైన భావోద్వేగాలతో కూడిన కుటుంబం యొక్క ప్రయాణం. వారు జీవించిన జీవితం ఇదే. వందదేవుళ్లు ఫస్ట్ లుక్‌ను విడుదల చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ పోస్టర్ హృదయాన్ని హత్తుకునేలా ఉంది .. విజయ్‌ఆంటోనీ, దర్శకుడు శశి, హీరోయిన్ స్వాసిక అండ్ చిత్ర బృందానికి నా శుభాకాంక్షలు' అని తెలిపాడు. రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.

# బ్లాక్ అండ్ బ్లాక్ అవుట్‌ఫిట్‌లో

ఐశ్వర్య రాజేష్ 'కౌసల్య కృష్ణమూర్తి' చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అయింది. ఇది తమిళంలో వచ్చిన 'కనా'కి అధికారిక రీమేక్. ఇందులో కూడా ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలో నటించింది. ఈ మూవీ ద్వారా ఈమెకు తమిళంలో మంచి గుర్తింపు వచ్చింది. కానీ ఈ చిత్రం రీమేక్ ద్వారా తెలుగులో ఈమెకు ఆ స్థాయి గుర్తింపు దక్కలేదు.చాలా కాలం పాటు ఐశ్వర్య రాజేష్ తమిళ్, తెలుగు సినిమాలలో నటిస్తూ ఓ మాదిరిగా కెరీర్ను కొనసాగించింది. పోయిన సంవత్సరం సంక్రాంతి కానుకగా ఈమె నటించిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం విడుదలయ్యింది. ఇది భారీ బ్లాక్ బాస్టర్ విజయాన్ని సాధించింది. దాదాపుగా 300 కోట్ల వసూళ్ళని రాబట్టి టాలీవుడ్ రీజనల్ ఇండస్ట్రీ హిట్టుగా నిలిచింది.ఇప్పటివరకు చాలా సినిమాల్లో నటించిన ఈ బ్యూటీ ఎక్కువ శాతం స్కిన్ షోకు దూరంగా ఉంటూ తన నటనతోనే ఆకట్టుకుంటుంది. అయితే సోషల్ మీడియాలో మాత్రం అప్పుడప్పుడు గ్లామర్ టచ్‌తో ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తుంది. తాజాగా ఆమె బ్లాక్ ఔట్‌ఫిట్‌లో, ఎరుపు బ్యాక్‌గ్రౌండ్‌లో తీసుకున్న హాట్ ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. ఇందులో ఈమె తన ఎద అందాలు ఫోకస్ అయ్యేలా స్టిల్స్ ఇచ్చింది.ఈ ఫోటోలలో ఆమె స్టైలిష్ లుక్, కాన్ఫిడెంట్ ఎక్స్‌ప్రెషన్స్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటుండగా, నెటిజన్లు పెద్ద ఎత్తున కామెంట్స్ చేస్తున్నారు. సంక్రాంతికి వస్తున్నాం పెద్ద హిట్ కావడం, అందులో ఈ నటి పాత్రకు మంచి ప్రాధాన్యత ఉండడంతో ఈ చిత్రం తర్వాత వరుస పెట్టి తెలుగులో ఈ బ్యూటీకి క్రేజీ చిత్రాలలో అవకాశాలు దక్కుతాయని చాలామంది అనుకున్నారు. కానీ సినిమా విడుదలై ఏడాది గడిచిన ఈమెకు భారీ చిత్రాలలో అవకాశాలు మాత్రం దక్కడం లేదు.







# సమ్మర్ రేసులో హీరోయిన్ల మధ్య గట్టి పోటీ

ఒకప్పుడు సమ్మర్ సీజన్ అంటే బాక్సాఫీస్ దగ్గర భారీ పోటీ, స్టార్ హీరోల హడావిడి కనిపించేది. కానీ ఇప్పుడు సీన్ మారింది. రిలీజ్‌లు తగ్గినా... ఈసారి సమ్మర్ రేసులో హీరోయిన్ల మధ్య మాత్రం గట్టి పోటీ నెలకొంది. క్లాస్, ఎమోషనల్ పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్... ఈసారి "డెకాయిట్"తో రఫ్ అండ్ టఫ్ అవతార్‌లో కనిపించబోతోంది. ఏప్రిల్ 10న ఈ సినిమా థియేటర్స్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మ్యాస్ట్రో ఫ్లాప్ కావడంతో నభా నటేష్ కెరీర్ లో చాలా గ్యాప్ వచ్చేసింది. ప్రస్తుతం నభా నటేష్ "స్వయంభు"తో రీఎంట్రీ ఇస్తోంది. భారీ పీరియాడిక్ ఫాంటసీ యాక్షన్ ప్రాజెక్ట్ అయినా... ఆమె కెరీర్ ప్రస్తుతం క్రిటికల్ స్టేజ్‌లోనే ఉంది. ఈ సినిమా హిట్ అయితేనే తిరిగి ఫామ్‌లోకి వచ్చే అవకాశం ఉంది.గోల్డెన్ లెగ్ ట్యాగ్‌తో ఉన్న సంయుక్త మీనన్ కూడా "స్వయంభు"తో మరోసారి తన లక్‌ను టెస్ట్ చేసుకుంటోంది. ఇప్పటివరకు వచ్చిన విజయాలు ఆమెకు ప్లస్ అయినా ప్రతి సినిమాతో అదే సెంటిమెంట్ కొనసాగదు అనడానికి అఖండ 2 రిజల్టే నిదర్శనం.. ఈసారి కంటెంట్ స్ట్రాంగ్‌గా లేకపోతే... తన ఇమేజ్ కూడా డౌన్ అయ్యే ఛాన్స్ స్పష్టంగా కనిపిస్తోంది. అఖిల్ సరసన "లెనిన్"లో నటిస్తున్న భాగ్యశ్రీ బోర్సేకు ఇది డూ ఆర్ డై ప్రాజెక్ట్‌లా మారింది. ఇప్పటివరకు చేసిన సినిమాలు పెద్దగా వర్క్ అవ్వలేదు రీసెంట్ గా వచ్చిన ఆంధ్రా కింగ్ తాలూకా అంచనాలు తలకిందులయ్యాయి. దాంతో ఇప్పుడు లెనిన్ సినిమా ఫలితం ఆమె కెరీర్‌ను నిర్ణయించనుంది. హిట్ అయితేనే ఇండస్ట్రీలో నిలబడే అవకాశం ఉంది... లేకపోతే అవకాశాలు మరింత కష్టమయ్యే పరిస్థితి ఉంది. ఈ సమ్మర్ బాక్సాఫీస్ వద్ద కేవలం కలెక్షన్స్ పోటీ మాత్రమే కాదు... హీరోయిన్ల కెరీర్ కోసం జరిగే కీలక పోరాటం కూడా. వీరిలో ఎవరు నిలబడతారు? ఎవరు వెనుకపడతారు? అనేది ఈ సీజన్‌తో క్లియర్ కానుంది.



# విషయం తెలిసాక నాన్న...

మెగా డాటర్ నిహారిక గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె సినిమాల్లోకి రాకముందు పలు షార్ట్ ఫిలిమ్స్ లో నటించి మంచి గుర్తింపును సంపాదించుకుంది. అలాగే తన తండ్రి అయిన నాగబాబుతో కలిసి కొన్ని టీవీ షోలకు కూడా అటెండ్ అయి బుల్లితెర ప్రేక్షకులను అలరించింది. ఈ ముద్దుగుమ్మ నాగశౌర్య హీరోగా నటించిన 'ఒక మనసు' చిత్రంతో వెండితెరకు పరిచయం అయింది. ఈ మూవీ బాక్స్ ఆఫీస్ దగ్గర ఫ్లాప్ అయ్యింది. ఆ తర్వాత పలు చిత్రాలలో ఈమె నటించినా కూడా వాటిలో ఏ సినిమా ద్వారా కూడా ఈమెకు విజయం దక్కలేదు, అలాగే నటిగా కూడా గొప్ప ప్రశంసలు అందలేదు. నటిగా సక్సెస్ కాలేకపోయినా ఈ బ్యూటీ నిర్మాతగా మాత్రం మంచి గుర్తింపును సంపాదించుకుంది.పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ పై ఈమె కొంతకాలం క్రితం కమిటీ కుర్రాళ్ళు అనే చిత్రాన్ని నిర్మించింది. ఈ మూవీ మంచి విజయం సాధించడమే కాకుండా విమర్శకుల ప్రశంసలను పొందింది. తాజాగా నిహారిక, సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన రాకాస అనే హర్రర్ కామెడీ చిత్రాన్ని నిర్మించింది. ఏప్రిల్ 3న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ చిత్ర విడుదల తేదీ దగ్గర పడడంతో ఈమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో భాగంగా ఈ సినిమా గురించి మాత్రమే కాకుండా తన వ్యక్తిగత విషయాల గురించి కూడా ఈ నటి ఓపెన్ అయింది. ముఖ్యంగా తన పెళ్లి, విడాకుల గురించి చెప్పుకొచ్చింది. జొన్నలగడ్డ వెంకట చైతన్య అనే అబ్బాయిని నిహారిక పెళ్లి చేసుకుంది.పెద్దలు కుదిర్చిన పెళ్లి కావడంతో ఎంతోమంది వ్యక్తుల మధ్య వీరి వివాహం రంగ రంగ వైభవంగా జరిగింది. ఆ తర్వాత వీరు దాదాపు ఒక ఏడాది పాటు కలిసి ఉన్నారు. ఆ తర్వాత పరస్పర అంగీకారంతో విడిపోయారు. నిహారిక విడాకులు తీసుకొని ఇప్పటికే మూడు సంవత్సరాల వరకు అవుతుంది. తాజాగా ఈమెకు మీరు విడాకుల నిర్ణయం తీసుకున్నాక మొదట ఎవరికి చెప్పారు అనే ప్రశ్న ఎదురయింది. దానికి ఈమె... నేను ఆ నిర్ణయం తీసుకున్నాక మా నాన్నగారికి చెప్పాను, ఆయన విషయం విని సైలెంట్ అయ్యారు. అలాగే పెళ్లి తర్వాత వారు నన్ను ఎంతో గమనించారు, నేను ఆనందంగా లేననే విషయం వారికి తెలుసు. దానితో మా నాన్న... నువ్వు ఇబ్బందిగా జీవితాన్ని కొనసాగించాల్సిన అవసరం లేదు, విడాకులు తీసుకొని సంతోషంగా ఉండు అన్నారు. ఆ తర్వాత నేను, నా భర్త ఇద్దరం పరస్పర అంగీకారంతో విడిపోయాం అని నిహారిక చెప్పుకొచ్చింది.



# ఓటీటీలో చిన్న సినిమా రికార్డ్..

కొంతమంది స్టార్ హీరోలు నటించిన సినిమాలతో పోలిస్తే పెద్దగా అంచనాలు లేని చిన్న సినిమాలు ఈ మధ్యకాలంలో ఓటీటీలో పెద్ద స్థాయిలో ఇంపాక్ట్ చూపిస్తున్నాయి. ఓ లేడీ ఓరియంటెడ్ చిత్రం ప్రస్తుతం డిజిటల్ ప్లాట్ ఫామ్ లో అద్భుతమైన రికార్డులను సొంతం చేసుకుంటుంది. ఇంతకు ఆ సినిమా ఏది అనుకుంటున్నారా? ఆ చిత్రం పేరు మేడ్ ఇన్ కొరియా. ఇందులో 'ఓజీ' బ్యూటీ ప్రియాంక అరుల్ మోహన్ ప్రధాన పాత్రలో నటించింది. ఈ ముద్దుగుమ్మ నటించిన మొదటి లేడీ ఓరియంటెడ్ చిత్రం ఇదే కావడం విశేషం.ఇందులోని ఈమె నటనకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ సినిమా థియేటర్లలో కాకుండా నేరుగా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ తమిళ చిత్రం 2026 మార్చి 12 నుంచి 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది. చిన్నప్పటి నుండి కొరియా వెళ్లాలని ఎంతో ఆశ ఉన్న అమ్మాయి ఒక అబ్బాయితో ప్రేమలో పడుతుంది. కొరియా వెళ్ళాక అతడు మోసం చేశాడని తెలుసుకొని బాధపడి, ఆ తర్వాత తనకు నచ్చిన దేశంలో ఎలా జీవితాన్ని ముందుకు సాగించింది అనే పాయింట్ తో ఈ చిత్రం ముందుకు సాగుతుంది.చాలా సింపుల్ స్టోరీ లైన్ అయినా కూడా ఈ చిత్రాన్ని దర్శకుడు కార్తీక్ అద్భుతంగా డీల్ చేశాడు. చాలామంది దీనిపై మంచి ఫీల్ గుడ్ చిత్రమని ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ చిత్రానికి జనాల నుండి మంచి రెస్పాన్స్ వస్తుండడంతో 'నెట్‌ఫ్లిక్స్'లో ఈ మూవీ ఇండియాలో నెంబర్ 1 స్థానంలో ట్రెండ్ అవుతుంది. ఈ మధ్యకాలంలో భారీ క్రేజ్ ఉన్న సినిమాల ఓటీటీ ఎంట్రీ లేకపోవడంతో మరికొంత కాలం పాటు ఈ సినిమా ఇంపాక్ట్ ఇలాగే కొనసాగుతుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు.

# వాయిదా లేదు..




ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత రామ్ చరణ్ తేజ హీరోగా నటిస్తున్న సినిమా 'పెద్ది'. 'ఉప్పెన' తర్వాత బుచ్చిబాబు డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. దానికి తగ్గట్టుగానే, సినిమా నుంచి రిలీజ్ అవుతున్న ప్రతి ప్రమోషనల్ స్టఫ్ సినిమా మీద అంచనాలను మరింత రెట్టింపు చేసేలా ఉంటున్నాయి. అయితే, ఈ సినిమా వాయిదా పడుతుందని ముందు నుంచి పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి ఈ సినిమా ఏప్రిల్ 30వ తేదీన రిలీజ్ అవుతుందని చివరిగా ప్రకటించారు. అయితే ఆ రోజు కూడా సినిమా రిలీజ్ అవ్వడం కష్టమేనా అనే ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది. తాజాగా టీం నుంచి అందుతున్న సమాచారం మేరకు, ఈ సినిమా వాయిదా పడడం లేదని అంటున్నారు.ఈ సినిమాకి సంబంధించి కొంత ప్యాచ్ వర్క్ తో పాటు, స్పెషల్ సాంగ్ మాత్రమే పెండింగ్ ఉంది. ప్రస్తుతానికి రామ్ చరణ్ తేజ అయ్యప్ప స్వామి దీక్షలో ఉన్నారు. ఈ దీక్షలో ఉండగా స్పెషల్ సాంగ్ చేయలేరు కాబట్టి, ప్రస్తుతానికి ఆ సాంగ్ చేయడం లేదు. రామ్ చరణ్ అయ్యప్ప దీక్ష పూర్తయిన వెంటనే ఆ సాంగ్ షూట్ చేయబోతున్నారు. మరోపక్క బుచ్చిబాబు ప్యాచ్ వర్క్ ఫినిష్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాని ఏప్రిల్ 30వ తేదీన గ్రాండ్ స్కేల్లో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా యుఎస్ బుకింగ్స్ కూడా అదే రోజు ఓపెన్ చేసే అవకాశం ఉంది. కాబట్టి 'పెద్ది' పోస్ట్‌పోన్ అయ్యే అవకాశం ఉందంటూ జరుగుతున్న ప్రచారానికి టీం బ్రేకులు వేసినట్లే!

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**